teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 353 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 16 మే 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## బీఈ కోర్సులో బ్యాక్లాగ్ సబ్జెక్టుల వారికి వన్ టైమ్ ఛాన్స్

**ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్**

హైదరాబాద్, మే 15 (తీన్మార్ న్యూస్): ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సులు పూర్తి చేసి బ్యాక్లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్ టైమ్ చాన్స్కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఓయూ అకాడమిక్ సెనేట్ స్టాండింగ్ కమిటీ అనుమతించిందని చెప్పారు. 2000 సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్ లాగ్

మిగతా 2 లో

మే 15 నుండి 26, 2025 వరకు తెలంగాణలోని కాళేశ్వరంలో జరుగుతున్నాయి. సరస్వతి నదిలో పవిత్ర స్నానాలు చేయడం వలన పాపాలను కడిగివేస్తుందని నమ్ముతూ భక్తులు స్నానాలు చేస్తారు. బృహస్పతి మిధున రాశి (మిథునం)లోకి ప్రవేశించినప్పుడు ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి ఈ పుష్కరాలు జరుపుకుంటారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వర పుణ్యక్షేత్రం సరస్వతీ పుష్కరాలకు రెడీ అవుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మానవాళికి మహెూపకారిగా, మోక్ష ప్రదాయినిగా నిలుస్తున్న పవిత్ర సరస్వతీనది పుష్కరశోభను సంతరించుకుంటోంది. ఈ సమయంలో సరస్వతి నదితీరంలో పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తారు. ఏ నదిలో పుష్కరాలు జరుగుతున్నాయో ఆ నదిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తే పాపాల నుంచి విముక్తి కలుగుతుందని పండితులు చెబుతున్నారు. ప్రస్తుతం సరస్వతి నది పుష్కరాలకు సిద్ధమవుతుంది. తెలంగాణలోని కాళేశ్వరంలో సరస్వతినదిలో పవిత్ర స్నానాలు చేసేందుకు లక్షలాది మంది భక్తులు సిద్ధమవుతున్నారు. కాగా సరస్వతీనది ఉత్తరాఖండ్ రాష్ట్రం బద్రీనాథ్ దగ్గరలోని "మన" అనే గ్రామంలో పుట్టింది. అయితే ఈ నది అంతర్వాహిని. అందువల్ల సరస్వతి నదీ పుష్కరాలు "మన" లో జరుగుతాయి.

# సరస్వతి పుష్కర వైభవం

**ఈ నెల 26 వరకూ జరగనున్న పుష్కరాలు**

- పుష్కరాల నిర్వహణకు రూ.35 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- పుష్కరాలలో స్నానం చేస్తే పుణ్యం
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాఖ్యలు
- 17 అడుగుల ఏక శిలా సరస్వతి మాతా విగ్రహ ఆవిష్కరణ
- సరస్వతి ఘాట్ ప్రజలకు అంకితం: సీఎం









05



## నష్టాన్ని పూడ్చకపోతే సీఎస్ సహా అధికారులు జైలుకే..

**స్పష్టం చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం**

**కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై సుప్రీంకోర్టు కీలక**

తెలంగాణ బ్యూరో, మే 15 (తీన్మార్ న్యూస్): కంచ గచ్చిబౌలి భూములవివాదం పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ నష్టాన్ని పూడ్చకపోతే తెలంగాణ ప్రభుత్వప్రధాన కార్యదర్శి సహా ఇతర ఉన్నతాధికారులకు జైలుశిక్ష తప్పదని ధర్మాసనం స్పష్టం చేసింది. పర్యావరణానికి నష్టం అనుమతులు

మిగతా 2 లో

## సీఎం రేవంత్ మూర్ఖత్వం వల్ల అధికారులకు "జైలు" శిక్ష..?

**కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తిన కేటీఆర్**

**సీఎం తన తప్పు ఒప్పుకోవాలి**



హైదరాబాద్, మే 15 (తీన్మార్ న్యూస్): కంచగచ్చిబౌలి భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూర్ఖత్వం వల్ల అధికారులు జైలుకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇక్కడ

మిగతా 2 లో

## సీనియర్ సిటిజన్ల కోసం కేర్ సెంటర్లు

- అనారోగ్య సమస్యలు గల సీనియర్ సిటిజన్లకు ఊరట
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- మనోవేదన చెందకుండా చేయూతకు అడుగులు
- రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో సెంటర్లను ఏర్పాటుకు కసరత్తు



వృద్ధాప్యంలో ఒంటరితనంతోపాటు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సీనియర్ సిటిజన్లకు ఊరట కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఒంటరి అయిపోయామని మనోవేదన చెందకుండా వారికి చేయూతనిచ్చే దిశగా ముందుకెళ్తున్నది.



## బొగ్గు సరఫరాకు ఛత్తీస్‌గఢ్ ఎన్ఎస్పిసిఎల్‌తో ఒప్పందం

**సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు సంతకాలు**




తెలంగాణ బ్యూరో, మే 15 (తీన్మార్ న్యూస్): సింగరేణి సంస్థ నుండి ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు లక్షల టన్నుల బొగ్గు సరఫరాకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దుర్గాపూర్ లో ఉన్న ఎన్ఎస్పిసిఎల్

మిగతా 2 లో

## విదేశీ వనితలకు రాష్ట్ర ఆడబిడ్డల చేత కాళ్లు కడిగించారు

**తీవ్రంగా తప్పుబట్టిన కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి**

**మన ఆడబిడ్డల అభిమానాన్ని తాకట్టుపెట్టారంటూ ధ్వజం**



హైదరాబాద్, మే 15 (తీన్మార్ న్యూస్): మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా హైదరాబాద్ కు వచ్చిన విదేశీ వనితలకు తెలంగాణ ఆడబిడ్డల చేత కాళ్లు కడిగించడాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఈ విషయంలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని, మన ఆడబిడ్డల అభిమానాన్ని తాకట్టుపెట్టారంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ ఆడపడుచులతో విదేశీ వనితల కాళ్లు కడిగిస్తారా.. అంటూ ప్రశ్నించారు కిషన్‌రెడ్డి. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు కిషన్‌రెడ్డి. ప్రపంచదేశాల ముందు తెలంగాణ

మిగతా 2 లో



## హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు షాక్

- చార్జీలను పెంచుతూ నిర్ణయం
- కనిష్ఠ ధర రూ.10 నుండి రూ.12కు పెంపు
- గరిష్ఠ ధర రూ.60 నుండి రూ.75కు పెంపు

.. వివరాలు 2లో

## ఆర్టీసీ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తారా..?

- ఫేమస్ కావడానికి పిచ్చివేషాలు వేస్తారా
- టీజీఎస్ఆర్టీసీ ఉపేక్షించదని హెచ్చరికలు జారీ
- ఎక్స్ వేదికగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పోస్ట్



02



## రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ప్రత్యేక కార్యాచరణకు ప్రణాళికలు**

.. వివరాలు 2లో

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హామీ ఏమైంది..?

- ఉద్యోగుల, విద్యార్థుల పక్షాన ప్రశ్నించే గొంతుకగా బండి సంజయ్
- వివిధ సమస్యలపై పలుమార్లు సీఎం రేవంత్‌కు లేఖలు



.. వివరాలు 2లో



## కొత్త విద్యా సంవత్సరానికి అంగన్‌వాడీలను సిద్ధం చేయాలి

- ప్రైవేట్ ప్లే స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాలి
- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

.. వివరాలు 2లో

# సీనియర్ సిటిజన్ల కోసం కేర్ సెంటర్లు

తెలంగాణ బ్యూరో, మే 15 (తీన్మార్ న్యూస్): వృద్ధాప్యంలో ఒంటరితనంతోపాటు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సీనియర్ సిటిజన్లకు ఊరట కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఒంటరి అయిపోయామని మనోవేదన చెందకుండా వారికి చేయూతనిచ్చే దిశగా ముందుకెళ్తున్నది. సామాజిక సంరక్షణతోపాటు మానసిక ఉల్లాసానికి బాటలు వేసేలా డే కేర్ సెంటర్లను నిర్మించాలని భావిస్తోంది. ఈ క్రమంలో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో దాదాపుగా 9 లక్షల మంది సీనియర్ సిటిజన్స్ ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇందులో చాలామంది ఆలనా, పాలనా లేక ఆందోళన చెందుతున్నారు. తమను ఆదరించేవారు లేక బయటకు చెప్పుకోలేక మనోవేదనతో కుమిలిపోతున్నారు. కనీసం యోగ క్షేమాలు అడిగేవారు లేకపోవడం వారిని మరింత కుంగదీస్తోంది. ఈ నేపథ్యంలో 60 ఏళ్ల వయస్సు పైబడినవారికి కాలక్షేపంతోపాటు వారి మంచి చెడులు చూడటం, సామాజిక సంరక్షణ బాధ్యతతోపాటు మానసికోల్లాసానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. వృద్ధులను ఒంటరితనం నుంచి దూరం చేయడమే కాకుండా ఆహ్లాదకర వాతావరణంలో సందడి చేసేలా ఈ సెంటర్లను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం జిల్లా కేంద్రాల్లో ఏమైనా ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయా? వాటికి రిపేర్లు చేస్తే వృద్ధులకు సౌకర్యాలు కల్పించవచ్చా? అని ఆరా తీస్తోంది. ఈ



మేరకు జిల్లా కేంద్రాల్లో ఖాళీ భవనాల వివరాలు తెప్పించుకుంటున్నట్లు సమాచారం. అయితే, భవనాలు లేనిచోట కొత్తవి నిర్మించాలా? అద్దె భవనాలు తీసుకుని ఈ సెంటర్స్ ఏర్పాటు చేయాలా? అనేదానిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

**రోజంతా ఉల్లాసంగా గడిపేలా**

ప్రస్తుత సమాజంలో అందరివీ ఉరుకులు పరుగుల జీవితాలుగా మారాయి. ప్రతి ఒక్కరూ ఏదోఒక పనిలో బిజీగా ఉంటున్నారు. ఇంట్లో కొడుకు, కోడలు, బిడ్డ, అల్లుడు ఉంటే ఇద్దరు ఉద్యోగాలకు వెళ్లిపోతున్నారు. మనవళ్లు, మనవరాళ్లు స్కూల్, కాలేజీకి వెళ్తారు. దీంతో ఇంట్లో వృద్ధులు ఒంటరి జీవితంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారికి బాసటగా నిలిచేందుకు డే కేర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ సెంటర్లలో రోజంతా హాయిగా కాలక్షేపం చేసేలా, ఇతర సీనియర్ సిటిజన్లతో సరదాగా మాట్లాడుకునే వాతావరణం కల్పించనున్నది. క్యారమ్స్, చెస్, ఇతర ఇండోర్ గేమ్స్ కు ఏర్పాట్లు చేయనున్నది. కథల పుస్తకాలు, న్యూస్ పేపర్లు కూడా అందుబాటులో ఉంచనున్నది. ఉదయం, సాయంత్రం యోగా, మెడిటేషన్‌చేసుకునే వెసులుబాటు సైతం కల్పించనున్నారు. సేదతీరేందుకు చక్కని గార్డెనింగ్, పూల మొక్కలు పెంచనున్నారు. వీల్‌చైర్స్, యాక్సెస్, ర్యాంప్‌లు, సులభంగా నడవడానికి తగిన సౌకర్యాలు కల్పించనున్నారు. అత్యవసర పరిస్థితుల కోసం అలర్ట్ సిస్టమ్‌లు, అగ్నినివారణ చర్యలు కూడా తీసుకోనున్నారు. మానసిక వేదన, భావోద్వేగానికి లోనయ్యేవారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు మానసిక ఆరోగ్య సలహాలు, ఒంటరితనం, డిప్రెషన్‌ను తగ్గించే కార్యకలాపాలు సైతం సర్కారు చేపట్టనున్నది.

# హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు షాక్

హైదరాబాద్, మే 15 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు షాక్ ఇచ్చింది. చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కనిష్ఠ ధర రూ.10 నుండి రూ.12కు పెంచింది. అంతేకాకుండా గరిష్ఠ ధర రూ.60 నుండి రూ.75కు పెంచింది. నాలుగు కిలోమీటర్ల నుంచి 6 కిలోమీటర్ల వరకు 30 రూపాయలు, 6 కిలోమీటర్ల నుంచి తొమ్మిది కిలోమీటర్ల వరకు 40 రూపాయలు, 9 కిలోమీటర్ల నుంచి 12 కిలోమీటర్ల వరకు 50 రూపాయలు, 12 కిలోమీటర్ల నుంచి 15 కిలోమీటర్ల వరకు 55 రూపాయలు, 18 కిలోమీటర్ల నుంచి 21 కిలోమీటర్ల వరకు 66 రూపాయలు, 21 కిలోమీటర్ల నుంచి 24 కిలోమీటర్ల వరకు 70 రూపాయలు, 24 కిలోమీటర్ల నుంచి ఆపై కిలోమీటర్లకు 75 రూపాయలు పెంచుతూ ఎల్ అండ్ టి నిర్ణయం తీసుకుంది. పెంచిన ఛార్జీలు శనివారం (మే 17) నుండి అమలులోకి వస్తాయని సంస్థ ప్రకటించింది. ఇటీవల చార్జీలు పెంచుతామని ప్రకటించగా చెప్పినట్టుగా తాజాగా పెంచిన ధరలను ప్రకటించింది. ఇదిలా ఉంటే ప్రతిరోజూ వేల మంది మెట్రోలో ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా ఆఫీసులకు వెళ్లే చాలా మంది బైకులు మరియు బస్సుల్లో ప్రయాణించకుండా మెట్రోలోనే ప్రయాణిస్తున్నారు. దీంతో మెట్రోలో రద్దీ కూడా పెరిగింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల మెట్రో సమయాన్ని కూడా పెంచుతూ ఎల్‌అండ్‌టీ నిర్ణయం తీసుకుంది. అయితే మొదటి నుండి మెట్రో నష్టాల్లో ఉందని చెబుతున్న సంస్థ చార్జీలను పెంచి ప్రయాణికులకు షాక్ ఇచ్చింది.

# ఆర్టీసీ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తారా..?

హైదరాబాద్, మే 15 (తీన్మార్ న్యూస్): సామాజిక మాధ్యమాల్లో రాత్రికి రాత్రే ఫేమస్ అవ్వడం కోసం చెత్త కంటెంట్‌తో చాలా మంది రీల్స్ చేస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో ఫాలోవర్లు, సబ్‌స్క్రైబర్లను పెంచుకోవడం ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తూ కొంత మంది రీల్స్, వీడియోలు చేస్తున్నారు. ఇప్పటికే పబ్లిక్ న్యూసెన్స్ ప్రాంక్స్ చేసి రీల్స్ చేసిన వారిని వివిధ రాష్ట్రాల్లో పోలీసుల దృష్టికి రావడంతో అరెస్ట్‌లు సైతం చేస్తున్నారు. అయిన కూడా ఇలాంటి వీడియోలు తీయడం మానటంలేదు. ఈ నేపథ్యంలో ఓ ఆర్టీసీ బస్సు కండక్టర్‌తో ఓ యువకుడు ప్రవర్తించిన తీరు వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. సిటీ బస్సు ఆర్టీసీ కండక్టర్‌తో యువకుడు ఓ ప్రాంక్ వీడియో చేస్తాడు. ఈ వీడియోను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఇదేం వెర్రి కామెడీ సోషల్ మీడియాలో ఫేమస్ కావడానికి ఎన్ని పిచ్చివేషాలైన వేస్తారా అని సజ్జనార్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. మీ పాపులారిటీ కోసం నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తారా..? అని నిలదీశారు. కామెడీ పేరుతో ఆర్టీసీ సిబ్బందికి విధులకు ఆటకం కలిగిస్తే (TGSRTC) టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఏమాత్రం ఉపేక్షించదని హెచ్చరించారు. ఇలాంటి సోషల్ మీడియా పిచ్చిమాలోకాలపై పోలీస్ శాఖ సహకారంతో చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోపై నెటిజన్లు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ వీడియో చేసిన యువకుడిని అరెస్ట్ చేయాలని, ఒకడికి కరెక్ట్‌గా శిక్ష పడితే వాన్ని చూసి ఇంకా ఎవరకు ఇలాంటి న్యూసెన్స్ క్రియేట్ చేసే రీల్స్ చేయరని ఓ నెటిజన్ కామెంట్ ఆసక్తికరంగా మారింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హామీ ఏమైంది..?



హైదరాబాద్, మే 15 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వంలో ఇబ్బంది పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల తరుపున ప్రశ్నించే గొంతుకగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మారారు. ఇటీవల కాలంలో బండి సంజయ్ వివిధ సమస్యలపై పలుమార్లు సీఎం రేవంత్‌కు లేఖలు రాశారు. ఈ క్రమంలో మరోసారి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సీఎం రేవంత్‌ను తన లేఖలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఇచ్చిన హామీ ఏమైందని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇప్పటికే విద్యా సంవత్సరం అయిపోయి కొత్త విద్యా సంవత్సరం వస్తుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. కొన్ని సంస్థలలో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా యాజమాన్యాలు తమ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని బండి సంజయ్ తన లేఖలో గుర్తు చేశారు. ఈ కారణంగానే రాష్ట్రంలో ఇప్పటికే అనేక కాలేజీలు మూతపడ్డాయని,విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ సీఎం రేవంత్ కు రాసిన లేఖలో డిమాండ్ చేశారు.

# విదేశీ వనితలకు రాష్ట్ర ఆడబిడ్డల చేత కాళ్లు కడిగించారు

మొదటి పేజీ తరువాయి



ఆత్మగౌరవాన్ని పెంచాల్సింది పోయి వారి ముందు మన ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టేట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటు. 72వ మిస్‌వరల్డ్ పోటీల్లో భాగంగా కల్చరల్, స్పిరిచువల్ టూర్‌లో పాల్గొనేందుకు యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ అయిన రామప్ప దేవాలయానికి ప్రపంచ అందగత్తెలు వచ్చిన సందర్భంలో విదేశీ వనితల కాళ్లను తెలంగాణ మహిళలతో, దళిత, గిరిజన యువతులతో కడిగించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అహంకారానికి నిదర్శనం. మహిళా సాధికారతకు, మహిళల ధైర్యసాహసాలకు ప్రతీక అయిన రాణి రుద్రమదేవి ఏలిన గడ్డపై, చారిత్రక రామప్ప ఆలయ ప్రాంగణంలో తెలంగాణ మహిళలను అవమానించడం దురదృష్టకరం. సమ్మక్క, సారలమ్మ పుట్టిన గడ్డపై మహిళలకు అత్యంత తీవ్రమైన అవమానం జరిగింది. ఇది కాంగ్రెస్ పార్టీ సంస్కృతి. భారతీయులను విదేశీయుల ముందు మోకరిల్లేలా చేయడమే కాంగ్రెస్ పార్టీ చరిత్ర. ఢిల్లీలోని ఆ కాంగ్రెస్ పార్టీ పెద్దలను సంతృప్తి పరిచేందుకే రాహుల్ గాంధీ భారతీయ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాళ్లు కడిగించారు. అతిథి దేవో భవ మన విధానం కానీ అతిథిని గౌరవించే క్రమంలో మన మహిళల ఆత్మగౌరవాన్ని తగ్గించేలా వ్యవహరించడం క్షమార్హం కాదు. విదేశీ అందగత్తెలముందు మన గౌరవాన్ని పెంచేలా వ్యవహరించి ఉంటే బాగుండేది. కానీ మన గౌరవాన్ని దిగజార్చింది. ప్రజల గౌరవాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత కానీ దీనికి విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడాన్ని తెలంగాణ బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఏమాత్రం సమర్థనీయం కాదు. ఇందుకుగానూ సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటుగా రేవంత్ రెడ్డి భారతీయ మహిళలకు, తెలంగాణ మహిళా సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## కొత్త విద్యా సంవత్సరానికి అంగన్‌వాడీలను సిద్ధం చేయాలి




హైదరాబాద్, మే 15 (తీన్మార్ న్యూస్): కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని, ప్రైవేట్ ప్లే స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' నినాదంతో ప్రచారం చేయాలని సూచించారు. గురువారం సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పై డిడబ్ల్యూఓ లతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంగన్వాడీ ల బలోపేతం పై జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలో, అంగన్‌వాడీ వయసు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేలా అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫర్నిచర్, ఆట వస్తువులు, ప్రీ-ప్రైమరీ విద్య, యూనిఫాంలు అందిస్తున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అక్షర జ్ఞానంతో పాటు వికాసం, ఉల్లాసం, పోషకాహార కేంద్రాలుగా అంగన్‌వాడీలు ఉన్నాయన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును ప్రజలకు తెలియజేసేందుకు వీడియోలు, ఫొటోలతో ప్రచారం చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత డీడబ్ల్యూఓలదేనని స్పష్టం చేశారు. సరైన పోషకాహారం అందితేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి పెట్టగలరని అన్నారు. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు, తాగునీరు, టాయిలెట్లు ఉండేలా చూడాలని, సరైన వసతులు లేని అంగన్‌వాడీ కేంద్రాలను సమీపంలోని ప్రభుత్వ భవనాలకు లేదా ప్రభుత్వ పాఠశాలలకు మార్చాలని సూచించారు. ఇరుకు గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఉండటం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు.

**ఒక్కో అంగన్ వాడీ కేంద్రం నిర్మాణానికి 12 లక్షలు:**

ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి రూ. 12 లక్షలు మంజూరు చేశామని, తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. అంగన్‌వాడీ లబ్ధిదారులకు పోషకాహారం అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. పీఎం జన్మన్ స్కీం ద్వారా పీవీటీజీ ఆవాసాల్లో 8 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు అయ్యాయని, వాటిని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. 85 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి రూ.12 లక్షలు, ఉపాధి హామీ నిధుల ద్వారా 457 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, వాటి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 500 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో 289 కేంద్రాల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలిన 211 కేంద్రాల్లో పనులు పూర్తి చేయాలని మంత్రి సీతక్క తెలిపారు. 1,811 అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి లేదని గుర్తించామని, అందులో 653 కేంద్రాల్లో వసతి కల్పించామని, మిగిలిన 1,158 కేంద్రాల్లో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. 7,021 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు లేవని గుర్తించామని, అందులో 2,004 కేంద్రాల్లో నిర్మాణం పూర్తయిందని, మిగిలిన 4,977 కేంద్రాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చిన్నారుల చిరునవ్వుకు చిరునామాగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌ను కమ్ముకున్న మేఘాలు.. భారీ వర్ష సూచన

## అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ వెల్లడి



తెలంగాణ బ్యూరో, మే 15 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కొన్ని రోజులుగా ఎండలు, కొద్దిగా వానలతో కొనసాగిన వాతావరణం ఇప్పుడు పూర్తిగా మేఘాలతో నిండిపోయినట్టు కనిపిస్తున్నది. ఈ (గురువారం) రోజంతా మేఘాలతోనే ఉంది. ఉదయం కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఉదయం 10 గంటల వరకు కురిసాయి. ప్రధానంగా జూబ్లిహిల్స్, బంజారాహిల్స్, కూకట్ పల్లి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 6 నుంచి 8 గంటల మధ్య కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. వర్షానికి తోడు, విపరీతమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈ ఈదురుగాలుల వల్ల కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపోతున్నాయి. రోడ్లపై ఎక్కడిక్కడ చెత్త చెల్లాచెదురుగా ఎగురుతోంది. కొన్నిచోట్ల రేకులు, ప్లాస్టిక్ వస్తువులు, డబ్బాలు, డ్రములు లాంటివి ఎగిరిపడుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే ఈ ఈదురుగాలులతో జాగ్రత్తగా ఉండాలని ఐఎండీ తెలిపింది. ఈ గాలులు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీస్తున్నాయి. గాలిసుడి..70 కిలోమీటర్ల వేగంతో ఉంది. నేడు రోజంతా హైదరాబాద్ పై మేఘాలు దట్టంగా పర్చుకుని ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎండ కనిపించడం లేదు. ఇంతలా వాతావరణం మార్పిపోవడానికి కారణం ఆగ్నేయ ఆసియా నుంచి వచ్చిన మేఘాలు.. ఇండియాపైకి వచ్చాయి. బలమైన గాలులు కూడా మేఘాలు వచ్చేందుకు కారణమయ్యాయి. సాయంత్రం 6 తర్వాత హైదరాబాద్ అంతటా ఓ మోస్తరు వర్షం కొనసాగుతోంది. అది రాత్రి 10గంటల వరకు ఉంటుంది. ఆ సమయంలో ప్రజలు గాలిని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా ఉండాలని బలమైన గాలులు వీస్తాయని ఐఎండీ చెబుతోంది. రాత్రి 10 తర్వాత హైదరాబాద్ లో భారీ వర్షం షురూ అవుతుంది. రాత్రి 12గంటలకు వర్షం మరింత ఎక్కువగా అవుతుంది. ఆ సమయంలో ప్రజలు రోడ్లపై పెద్దగా తిరగరు.. కాబట్టి ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఉండదు. కానీ భారీ వర్షాల రోడ్లపై నీరు ప్రవహించే ఛాన్స్ ఉంటుంది. ఈ వర్షం 16వ తేదీ తెల్లవారుజామున 4 గంటల వరకు కురుస్తుంది. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ చెబుతోంది.

# నష్టాన్ని పూడ్చకపోతే సీఎస్ సహా అధికారులు జైలుకే..

మొదటి పేజీ తరువాయి

లేకుండా పనులు సుప్రీంకోర్టు ధర్మాసనం - కంచ గచ్చిబౌలి భూముల్లో చేపట్టిన పనులకు పర్యావరణ అనుమతులు తీసుకున్నారా లేదా? అన్న అంశంపై అధికారులను నిలదీసింది. లాంగ్ వీకెండ్ దొరికిన వెంటనే పనులు ఎందుకు చేపట్టారని ప్రశ్నించింది. పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చాల్సిందేనని, లేదంటే జూతో పాటు ఇతర అధికారులకు జైలు శిక్ష తప్పదని హెచ్చరించింది.

**రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన క్లియర్ రిపోర్ట్**

ఈ వ్యవహారంపై పర్యావరణ నష్టం పూడ్చేందుకు తీసుకునే చర్యల వివరాలను తక్షణమే కోర్టుకు సమర్పించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమస్యను చిన్నదిగా తీసుకోవద్దని, ప్రజల హక్కులు, పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలతో తెలంగాణలో కంచ గచ్చిబౌలి భూముల వివాదం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. పర్యావరణ నిబంధనలు అతిక్రమించడంపై సుప్రీంకోర్టు తీసుకున్న గట్టినిలువు ఇప్పుడు అధికారులపై ఒత్తిడి పెంచింది.

# సీఎం రేవంత్ మూర్ఖత్వం వల్ల అధికారులకు "జైలు" శిక్ష..?

మొదటి పేజీ తరువాయి

పర్యావరణ విధ్వంసానికి తాను బాధ్యుడిని కాదని రేవంత్ రెడ్డి తప్పించుకునే అవకాశం లేదని రేవంత్ రెడ్డి తన తప్పు ఒప్పుకోవాలన్నారు. సీఎం దుష్ప్రవర్తనతో తెలంగాణ ప్రభుత్వ అధికారులను సుప్రీంకోర్టు హెచ్చరించిందన్నారు. కంచగచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. వందల బుల్డోజర్లతో ధ్వంసం చేసిన కంచె గచ్చిబౌలి అడవులను తిరిగి పునరుద్ధరించాలని లేకుంటే రేవంత్ రెడ్డికి కోర్టు శిక్షలు తప్పవన్నారు. కంచె గచ్చిబౌలి భూములను అమ్మి పది వేల కోట్ల రూపాయల స్కాం చేయడం ముమ్మాటికి అవినీతి, నమ్మకద్రోహమేనని, సెలవుదినాల్లో బుల్డోజర్లను పంపి అడవులను ధ్వంసం చేయడం ముమ్మాటికి పర్యావరణ చట్టాల ఉల్లంఘనేనని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్య చర్యల ఫలితంగా పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిందన్నారు. కంచె గచ్చిబౌలి భూములను ప్రభుత్వం కాపాడాల్సిందేని ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తాను సృష్టించిన విధ్వంసానికి, తన బాధ్యతారాహిత్యానికి, చేసిన పది వేల కోట్ల స్కాంకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# బొగ్గు సరఫరాకు ఛత్తీస్‌గఢ్ ఎన్‌ఎస్పిసిఎల్ తో ఒప్పందం

మొదటి పేజీ తరువాయి

గురువారం నాడు ఒప్పందం కుదుర్చుకుంది. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు ఈడీ కోల్ మూమెంట్ ఎస్డీఎం సుభాని సమక్షంలో సింగరేణి జీఎం మార్కెటింగ్ ఎన్ వి. రాజశేఖర్ రావు, ఎన్ఎస్పిసిఎల్ సీఈవో దివాకర్ కౌశల్, జీఎంలు నీల్ కమల్, పలాష్ లు ఈ అగ్రిమెంట్ పై సంతకాలు చేశారు. ప్రముఖ జాతీయ బొగ్గు ఉత్పత్తి సంస్థ ఆయన ఎన్టీపీసీ, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు సంయుక్తంగా ఏర్పాటు చేసుకున్న జాయింట్ వెంచర్ కంపెనీ ఎన్ఎస్పిసిఎల్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో దుర్గాపూర్ వద్ద ఏర్పాటు చేసిన థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఈ బొగ్గును సరఫరా చేయనున్నారు. సింగరేణి సంస్థ నాణ్యత గల బొగ్గును తగిన పరిమాణంలో సకాలంలో అందజేస్తుందని, కనుక తాము ఈ కంపెనీ నుండి బొగ్గు కొనడానికి ముందుకు వచ్చామని ఎన్ఎస్పిసిఎల్ అధికారులు తెలియజేశారు . ఇంకా ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్లు శ్రీనివాసరాజు, సురేందర్ రాజు పాల్గొన్నారు.

# రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు

హైదరాబాద్, మే 15 (తీన్మార్ న్యూస్): రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు, భూ లావాదేవీలను సమర్ధవంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కర్నాటక రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోబోతున్నామన్నారు. దీని కోసమే ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారిని ఎంపిక చేసి తెలంగాణ సర్వే శిక్షణా అకాడమిలో శిక్షణ ఇస్తామన్నారు. కర్నాటకలో అమలవుతున్న లైసెన్స్‌డ్ సర్వే విధానంపై ఇటీవల సర్వే విభాగానికి సంబంధించిన ఇద్దరు ఉన్నతాధికారులు అధ్యయనం చేసి నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటునట్లు ప్రకటించారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ పథకం 1999 లో కర్నాటక ల్యాండ్ రెవెన్యూ చట్టంలో చేసిన సవరణలతో ప్రారంభమై, 2005-06 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా భూముల రిజిస్ట్రేషన్‌కు ముందు మ్యూటేషన్ స్కెచ్ తయారు చేస్తున్నారని, ప్రీ-రిజిస్ట్రేషన్ స్కెచ్‌తో కొనుగోలు చేయబోయే భూమి గురించి, విస్తీర్ణం, టైటిల్ వంటి స్పష్టమైన భూ సరిహద్దు వివరాలు ఉంటాయని అధికారులు గురువారం మంత్రికి వివరించారు. ప్రస్తుతం కర్నాటక రాష్ట్రంలో 6 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు, 4 వేల మంది ప్రభుత్వ సర్వేయర్లు సేవలందిస్తున్నారన్నారు. ఒక్కో లైసెన్స్‌డ్ సర్వేయర్ కు నెలకు సగటున 23 దరఖాస్తులు వస్తాయన్నారు. దీని ద్వారా అతనికి నెలకు 25 వేల నుండి 30 వేల ఆదాయం వస్తుందని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు నిర్వహించి, రిజిస్ట్రేషన్ కు ముందు స్కెచ్ తయారు చేసి పోర్టల్లో అప్ లోడ్ చేస్తారు. వీరి పనులను ప్రభుత్వ సర్వేయర్లు పరిశీలించి, సంబంధిత అధికారి ఆమోదిస్తారు. ఈ పథకం ద్వారా భూ లావాదేవీలు మరింత సమర్థవంతంగా, శాస్త్రీయంగా సాగుతున్నాయని అధికారులు వివరించారు.

**సర్వే మ్యాప్ తప్పనిసరి**

తెలంగాణ రాష్ట్రంలో శాశ్వతంగా భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకమైన భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా, ఈ విధానం అమలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో ఆయా మండలాల్లో భూ లావాదేవీలు, భూ విస్తీర్ణాన్ని బట్టి సర్వేయర్లను నియమించాలని సూచించారు. కర్నాటక రాష్ట్రంలో దాదాపు 20 ఏండ్ల క్రితం నియమితులైన సర్వేయర్లు కొనసాగుతునే ఉన్నారని, ఇక్కడ కూడా అదే విధానాన్ని అవలంభించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

# బీఈ కోర్సులో బ్యాక్లాగ్ సబ్జెక్టుల వారికి వన్ టైమ్ ఛాన్స్

మొదటి పేజీ తరువాయి

పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్షా ఫీజును ఈ నెల 24వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో కలిపి 27వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# గూగుల్ క్లౌడ్ సంస్థతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఒప్పందం



తెలంగాణ బ్యూరో, మే 15 (తీన్మార్ న్యూస్): గూగుల్ క్లౌడ్ సంస్థతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కీలక ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో సైబర్ భద్రత బలోపేతం కోసం గూగుల్ క్లౌడ్‌తో ఈ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో 24/7 సైబర్ సెక్యూరిటీని పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. భద్రతతో పాటూ పోలీసుల ఐటీ, మౌలిక సదుపాయాలను గూగుల్ క్లౌడ్ పర్యవేక్షిస్తుందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్ వెల్లడించారు. అంతే కాకుండా ఈ ఎంవోయూకు మూడేళ్ల కాలవ్యవధి ఉందని తెలిపారు.

# ఈ నెల 25 యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష

### జిల్లా పరిధిలో 10 పరీక్షా కేంద్రాలు

### పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండ జిల్లా, మే 15 (తీన్మార్ న్యూస్): యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్- 2025 నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో మే 25న జరగనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్ష నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ కోసం హనుమకొండ జిల్లా పరిధిలో 10 పరీక్షా కేంద్రాలను కేటాయించడం జరిగిందన్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను 4141 మంది అభ్యర్థులు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష రెండు సెషన్లలో ఉంటుందన్నారు. మొదటి సెషన్ పరీక్ష మే 25న ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకు, రెండో సెషన్ లో పరీక్ష మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు 30 నిమిషాల ముందుగానే చేరుకోవాలన్నారు. ఉదయం 9 తర్వాత, మధ్యాహ్నం 2 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోని కి అనుమతించరని పేర్కొన్నారు.

అభ్యర్థులు అడ్మిట్ కార్డు తో పాటు అందులో పేర్కొన్న గుర్తింపు కార్డులలో ఏదైన ఒక కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు.

పరీక్షా కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవన్నారు. పరీక్ష కేంద్రానికి అడ్మిట్ కార్డు తో పాటు పెన్ను, పెన్సిల్ను వెంట తెచ్చుకోవాలన్నారు. చేతి గడియారాలు కూడా అనుమతించబడవని అన్నారు.

యుపిఎస్సి ప్రిలిమినరీ పరీక్షలు ఉన్న దృష్ట్యా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉదయం 6 గంటల నుండి పరీక్ష పూర్తయ్యే వరకు అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఒక ఏఎన్ఎం, ఆశా కార్యకర్తను అందుబాటులో ఉంచి అవసరార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలన్నారు. యూపీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తున్న దృష్ట్యా విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేయాలన్నారు. పరీక్ష నిర్వహించే రోజున ఆర్టీసీ బస్సులు ఉదయం 7 గంటల నుండి ప్రారంభమవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి, డీఈఓ వాసంతి, టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ ఈ మధుసూదన్ రావు, తహసీల్దార్లు, పరీక్షా కేంద్రాల సూపర్వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పుష్కరాలకు వచ్చే భక్తులకి అన్నదానం

### సత్రాన్ని ప్రారంభించిన ఐటి మినిస్టర్ శ్రీధర్ బాబు



కాళేశ్వరం, మే 16 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన సత్రాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించి భక్తులకు అన్నదానం వడ్డించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భక్తుల సౌకర్యార్థం అన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు కాళేశ్వరం పుష్కర స్నానానికి వచ్చినటువంటి భక్తులకి అన్నదాన సత్ర విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాసిరకమైన వంటలు చేయకుండా ఇచ్చిన భక్తులకి కడుపునిండా భోజనాలు చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని వాసవి క్లబ్ సభ్యులతో ఐటి మినిస్టర్స్ శ్రీధర్ బాబు వారికి ఇలాంటి సహాయం చేయడానికి అయినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## పుష్కర స్నానాలకి వచ్చే భక్తులకి అభివృద్ధి గురించి తెలియజేస్తున్న టిడిపి నేతలు



కాళేశ్వరం, మే 15 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని శ్రీ సరస్వతీ పుష్కరాల సందర్భంగా ప్రభుత్వం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా టెంట్ సిటీ ఏర్పాటు చేసి హస్తకళలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో వివిధరకాల స్టాల్లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా మహాదేవపూర్ ట్రస్సర్ కాలనీకి చెందిన పట్టు వస్త్రాల తయారీ దారులు ఏర్పాటు చేసిన స్టాల్ ను తెలంగాణ తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజునాయక్, మాజీ మంథని ఇంచార్జ్ అందె భాస్కరాచారి, బోర్లగూడెం మాజీ యంపీటీసీ సభ్యులు శ్రీమతి అందె సంధ్యారాణి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాదేవపూర్ లోని పట్టు పరిశ్రమ ను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. పట్టు వస్త్రాల తయారీ దారులకు పెన్షన్ ఇవ్వాలని,ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, పరిశ్రమ ప్రోత్సాహానికి 100 శాతం సబ్సీడి ఋణాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులు, అధికారులు దసలి పట్టు వస్త్రాలు కొనుగోలు చేసి హస్తకళలను ప్రోత్సహించే విధంగా ప్రచారం కల్పించాలని కోరారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని ఉపయోగించుకోవాలి

### జిల్లా అథ్లెటిక్ చైర్మన్ పంతకాని సమ్మయ్య




కాటారం, మే 15 (తీన్మార్ న్యూస్): పిల్లలకు ప్రతి రోజు ఉచిత కోడిగుడ్లు మరియు అరటి పండ్లు ప్రదానం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు అజ్మీర శ్రీకాంత్ నాయక్ మరియు కాటారం వ్యాపారి మద్ది సంపత్, కాటారం మండల కేంద్రంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఉచిత కోడిగుడ్ల పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అథ్లెటిక్ చైర్మన్ పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరం నీ పిల్లలు అందరు సద్వినియోగం చేసుకోవాలని, వేసవి అనంతరం కూడా ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుంది అన్నారు. ఈ అవకాశాన్ని పిల్లలు అందరు ఉపయోగించుకోనీ భవిష్యత్ లో క్రీడాల్లో రాణించాలని కొనియాడారు. ఈ సందర్భంగా పిల్లలకు ఉచితంగా కోడిగుడ్లు మరియు అరటి పండ్లు పంపిణి చేస్తున్న అజ్మీర శ్రీకాంత్ నాయక్ మరియు మద్ది సంపత్ నీ పంతకాని సమ్మయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరి కుమార్ యాదవ్, పున్నం రమేష్, ఓలపు శ్రీనివాస్, జాడి శ్రీశైలం, మద్ది సంపత్,అక్కపాక రమేష్, పిఈటీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిపై కప్పుని ఆనుకోని ప్రమాదంగా విద్యుత్ ఎల్ టి లైన్

### వడగాలుకు ప్రమాదం జరిగే అవకాశం

### బిక్కు బిక్కున జీవిస్తున్న జిముడ తులసి రామ్

### విద్యుత్ అధికారులు స్పందించాలని వేడుకోలు



మహాదేవపూర్, మే 15 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కుంట్లం గ్రామంలో జిముడ తులసి రామ్ ఇంటి పై కప్పుని ఆనుకోని చాలా ప్రమాదంగా విద్యుత్ ఎల్ టి లైన్ ఉంది. వేసవి కాలంలో వడగాలుకు ప్రమాదం జరిగే అవకాశముందని పై భాగాన్ని ఆనుకోని ఉండటంతో బిక్కు బిక్కు మంటు జీవిస్తున్నానని ఇంటి యజమాని తులసి రామ్ చెప్తున్నాడు. ఎలాంటి ప్రమాదం జరుగముందే విద్యుత్ అధికారులు చర్య తీసుకొని ఎల్ టి లైన్ పక్కనకు మార్చగలరని కోరుతున్నాడు.

## విద్యార్థుల అవసరాల దృష్ట్యా మౌళికసదుపాయాలు కల్పిస్తాం


### ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కుమార్




హైదరాబాద్, మే 15 (తీన్మార్ న్యూస్): ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల అవసరాల దృష్ట్యా అవసరమైన మౌళికసదుపాయాలు కల్పిస్తామని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం అన్నారు. సిద్దిపేటలోని ఓయూ జిల్లా పీజీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన అధ్యాపకులు, విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు అసరమైన చర్యలు తీసుకుంటున్నామన్న ప్రొఫెసర్ కుమార్ సిద్దిపేటలో ఎమ్మెస్సీ డాటా సైన్స్ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. మార్కెట్లో ఉన్న డిమాండ్ దృష్ట్యా ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో సీట్ల సంఖ్య పెంచనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత సిద్దిపేట జిల్లా కలెక్టర్ ను ఓయూ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. కళాశాల సమస్యల పరిష్కారం కోసం తాము చేసిన పలు ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రధాన రహదారి నుంచి కళాశాల ప్రాంగణంలోకి రోడ్డు వేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. వీధిలైట్లు సహా మంచినీటి సౌకర్యం కోసం అసరమైన చర్యలు చేపట్టేందుకు హామీ ఇచ్చిన జిల్లా కలెక్టర్ కు ఈ సందర్భంగా ఓయూ ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పీజీ కేంద్రం సందర్శనతో పాటు జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితెందర్ కుమార్ నాయక్, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర నాయక్, మౌళికసదుపాయాల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా పీజీ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రవినాథ్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు లేకుంటే అంచనాలకు మించి వడ్లు ఎలా పండినాయి

### హరీష్ రావు, కేసీఆర్ ల శ్రమ ఫలితమే రైతులకు సాగు నీరు



చిన్నకోదూర్, మే 15 (తీన్మార్ న్యూస్): 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో కరువు వలసలు మిర్రలు బారిన భూములు రైతుల ఆత్మహత్యలు తప్ప మీరు చేసింది ఏమిటి రేవంత్ రెడ్డి అని బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. గురువారం నాడు ప్రెస్ నోట్ విడుదల చేసిన సందర్భంగా సీనియర్ నాయకులు పానుగంటి రమేష్ తో కలిసి జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించేవరకు తెలంగాణ రాష్ట్రానికి కెసిఆర్ ముఖ్యమంత్రి అయినాక మొక్కవోని దీక్షతో రైతు కుటుంబాలలో సంతోషాన్ని నింపాలే అప్పుడే తెలంగాణ రాష్ట్రం బాగుంటుందని సంకల్పించి కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించి అప్పటి ఇరిగేషన్ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే హరీష్ రావుకి ప్రాజెక్టు బాధ్యతలు అప్పజెప్పితే కంటిమీద కునుకు లేకుండా రెయిన్బోలు కష్టించి నూట ముప్పై ఐదు మీటర్ల ఎత్తు ప్రాజెక్టు నిర్మాణం చేసి వందల కిలోమీటర్లు కాలువలు తవ్వి కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటుగా మేడిగడ్డ సుందిళ్ల మధ్య మానేరు అన్నపూర్ణ ప్రాజెక్టు రంగనాయక సాగర్ మల్లన్న సాగర్ ఇలా అనేక ప్రాజెక్టులో నిర్మిస్తే ఈరోజు రైతులు భూమికి బరువయ్యే పంటలను తీస్తూ వచ్చే ఆదాయంతో అప్పులు తీర్చుకుంటూ ఆ కుటుంబాలు సంతోషంగా ఉన్న విషయాన్ని మరిచిపోయి రేవతి రెడ్డి మతిభ్రమించినట్లుగా పదేపదే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని చెప్పడము రేవంత్ రెడ్డి అవివేకానికి నిదర్శనమని అన్నారు రేవంత్ రెడ్డి 18 నెలల పాలనలో తెలంగాణ రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమిటో చెప్పాలని కెసిఆర్ వేసినటువంటి నోటిఫికేషన్ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి రేవంత్ రెడ్డి చేసినట్లుగా చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు ఇకనైనా విమర్శలు మాని తెలంగాణ అభివృద్ధి గురించి ఆలోచన చేస్తే బాగుంటుందని వారు అన్నారు.

## ఈదురు గాలి బీభత్సం - రేకుల డబ్బా ధ్వంసం

### సెకన్లలో తప్పిన పెను ప్రమాదం.

### రూ. 60,వేల వరకు ఆస్తి నష్టం



పెద్దమండడి మే 15 తీన్మార్ న్యూస్ : పెద్దమండడి మండలం అల్వాల గ్రామంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలి బీభత్సం సంచలనం సృష్టించింది. రైతు బాల్‌రెడ్డి తన వ్యవసాయ అవసరాల కోసం నిర్మించిన రేకుల డబ్బా గాలులకు పూర్తిగా ధ్వంసమైంది. దీంతోపాటు విద్యుత్ లైన్లపై రేకులు పడటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో సుమారు రూ. 60,000 వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా. ప్రమాదాన్ని ఎదుర్కొన్న బాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయాన్ని కోరుతున్నారు.

## 2025-2026 సం. అత్యుత్తమ జూ. కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

మహబూబాబాద్ జిల్లా, మే 15 (తీన్మార్ న్యూస్): 2025 2026 విద్యా సంవత్సరమునకు అర్హులైన SC/ST/BC/EBC/Minority and Disabled విధ్యార్థులు అత్యుత్తమ జూనియర్ కళాశాలలో ప్రవేశమునకు ఆన్ లైన్ లో దరఖాస్తులు అహ్వానించబడుచున్నవని జిల్లా షెడ్యుల్ కులముల అభివృద్ధి అధికారి ఎం. నరసింహస్వామి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2025 లో 10 తరగతి నందు 7.0 /400 మార్కులు మరియు జిపిఎ, ఆపై గ్రేడు పొందిన విధ్యార్థులు మాత్రమే అర్హులని, ప్రభుత్వ షెడ్యూల్డు కులముల వసతి గృహములు/ఆశ్రమ పాటశాలలు/కస్తూరిబా పాటశాలలు మరియు ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్ మరియు ఎయిడెడ్ పాటశాలలో చదివిన విధ్యార్థులు (డే స్కాలర్స్ ) మరియు ప్రభుత్వ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయాల విధ్యార్థులు మరియు బెస్ట్ అవైలబుల్ స్కీం క్రింద చదివిన విధ్యార్థులు మాత్రమే ధరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయము గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి రూ.1,50,000/- లు మరియు పట్టణ ప్రాంతానికి చెందిన వారికి రూ.2,00,000/- లకు మించరాదన్నారు. ధరఖాస్తు చేసుకొనే విధ్యార్థులు తేది 17-05-2025 నుండి 31-05-2025 వరకు ఈ-పాస్ వెబసైట్ ద్వారా (https://telanganaepass.cgg.gov.in) ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోగలరు మరియు ధరఖాస్తుతో పాటు ఈ క్రింద తెలిపిన ధృవీకరణ పత్రములు జతచేయవలెనన్నారు.

1. 10వ తరగతి పాస్ మెమో
2. కులము, ఆదాయ ధృవీకరణ పత్రములు మీ-సేవా ద్వారా పొందినవి
3. బ్యాంకు పాస్ బుక్
4. అధార్ కార్డ్ నెంబర్
5. రేషన్ కార్డ్ నెంబర్ వివరములు
6. పాస్ పోర్ట్ సైజ్ ఫోటో
7. ప్రభుత్వ పెద్యూల్డు కులముల వసతి గృహముల విధ్యార్థులు (3 ) సంవత్సరంల బోనోపైడ్ ధృవీకరణ పత్రము జతపర్చవలెను.

ఆన్ లైన్ లో ఈ-పాస్ వెబసైట్ నందు దరఖాస్తు చేసుకునేటప్పుడు విధ్యార్థులు ప్రాధాన్యత క్రమములో (3) కళాశాలలను ఎంపిక చేసుకోవలెనన్నారు. ధరఖాస్తు ప్రక్రియ ముగిసిన పిదప ఈ-పాస్ సిస్టమ్ ద్వారా విధ్యార్థుల ఎంపిక ఆటోమేటిక్ గా జరుగునని మరియు కళాశాలలు అలాట్ చేయబడునన్నారు.

## గ్రామసభల సమర్ధవంత నిర్వహన, ఆర్టిఐపై శిక్షణ





మహబూబాబాద్ జిల్లా, మే.15 (తీన్మార్ న్యూస్): పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమంలో డిపిఓ హరి ప్రసాద్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామ సభల యొక్క సామర్ధ్యాన్ని పెంచుటకు, గ్రామ సభలో ప్రజల యొక్క భాగస్వామ్యాన్ని పెంపొందించి, ప్రత్యేకించి మహిళా గ్రామసభలు నిర్వహించడం మరియు గ్రామాలలో పారదర్శక పాలన అందించటానికి, అలాగే సమాచార హక్కు చట్టం ప్రజా ఫిర్యాదులు ప్రజలకు సులభంగా సమాచారం అందించే విధంగా తీసుకోవలసిన అంశాలపై మరియు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 యొక్క ప్రధాన అంశాల మీద, మహిళా స్నేహపూర్వక గ్రామపంచాయతీ, పిల్లల స్నేహ పూర్వక పంచాయతీలుగా తీర్చిదిద్దడానికి గ్రామంలో చేపట్టవలసిన ఆక్టివిటీస్, అంశాలు, ప్రణాళికల పై ప్రధానంగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారాలు మరియు పంచాయతీ రాజ్ చట్టం ద్వారా సంక్రమించిన అధికారాలు ప్రజా ప్రతినిధులకు గ్రామ ప్రజలకు మరియు గ్రామంలో పనిచేస్తున్న గ్రామస్థాయి ఉద్యోగులకు ఒక సమాచార భాగస్వామిగా వ్యవహరించుటకు పంచాయతీ కార్యదర్శుల యొక్క పాత్ర ఏ రకంగా ఉండాలని విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హైదరాబాదులో శిక్షణ పొందిన మీర్జా మునవర్ బేగ్ మండల పంచాయతీ అధికారి డోర్నకల్ మరియు డి మురహరి రావు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (రిటైర్డ్) మధిర పంచాయతీ కార్యదర్శులు రెండు రోజుల ట్రైనింగ్ కార్యక్రమానికి శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

# ఇసుక అనుమతులు ఆంధ్రోడి అడ్డా

**ఊక చెట్టువాగు ఇసుక ను ఊడ్చేస్తున్న ఆంధ్ర కాంట్రాక్టర్.**

**అనుమతులకు మించి ఇసుక తరలింపు.**

**అనుమతి ఒకచోట తవ్వకాలు మరోచోట.**

**నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారంటూ ఆరోపణలు.**

**ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయంటున్న గ్రామస్థులు ఆందోళన.**

**అక్రమంగా ఇసుక తరలుతున్నా నిద్రావస్థలో అధికార యంత్రాంగం.**

**దేవరకద్ర నియోజకవర్గం ఇన్చార్జి బిఎస్పి పార్టీ బసిరెడ్డి సంతోష్ రెడ్డి**





దేవరకద్ర ప్రతినిధి,మే15(తీన్మార్ న్యూస్) : అనుమతులకు మించి ఇసుక తరలింపు ఒక ప్రధాన సమస్య,ఇది అక్రమంగా జరుగుతుందని,భూగర్భ జలాల తగ్గింపు మరియు పర్యావరణ నష్టాలకు దారితీస్తుంది.ఈ సమస్యను పరిష్కరించడానికి,ఇసుక రవాణాపై నిఘా ఉంచడం మరియు అనుమతులను పర్యవేక్షించడం అవసరమని బీఎస్పీ పార్టీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జి బసిరెడ్డి సంతోష్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మరియు కౌకుంట్ల మండలాల మధ్య ఉకచెట్టు వాగు లో అనుమతులకు మించి ఇసుక తరలింపు అంటే,ప్రభుత్వ అనుమతులకు మించి ఇసుక తవ్వడం,తరలించడం లేదా రవాణా చేయడం భూగర్భ జలాల తగ్గింపు మరియు పర్యావరణ నష్టాలకు దారితీస్తుందని ఆరోపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

ఆంధ్ర కాంట్రాక్టర్ గద్దల్లా వాలిపోయి విచ్చల విడి తవ్వకాలు జరుగుతున్నాడని కోరారు.ఆంధ్ర ఇసుకాసురులు అనుమతి ఒకచోటనైతే తవ్వకాలు మరోచోట జరుపుతున్నారని స్థానిక గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడుతూ వాహనాల్లో పరిమితికి మించి ఇసుకను తరలిస్తున్నారని ఆరోపణలు చేశారు. ప్రతిరోజూ రూ.లక్షల విలువ చేసే ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు.ఇదంతా సంబంధిత శాఖ అధికారులతో పాటు స్థానిక రెవెన్యూ,మైనింగ్,పోలీసులకు తెలిసినప్పటికీ ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారని అన్నారు.ఆంధ్రుడి అండ దండాలతో అక్రమంగా తరలిస్తున్న అడుగుతున్న రైతులపై అధికారులు దౌర్జన్యంగా ప్రవర్తిస్తున్నారని,ఇసుక రవాణా ను అడ్డుకుంటున్న రైతులపై దౌర్జన్యంగా వ్యవహరిస్తు,దుర్భాషలాడి,సెల్ ఫోన్ లాక్కొని భయాందోళనకు గురి చేస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరారు.ఇకనైనా అధికారులు నిద్రావస్థను వదిలి పర్యావరణాన్ని కాపాడాలని మండలం ప్రజలు కోరుతున్నారని ఆరోపించారు.లేనిచో బిఎస్పి పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం పాదయాత్రతో ముట్టడించి నిరసన ఆందోళన చేపడతామని కోరారు.

# ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

**రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి హాజరైన మంత్రి**



వరంగల్ జిల్లా, మే 15 (తీన్మార్ న్యూస్): శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గురువారం వరంగల్ లోని బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ హైస్కూల్లో జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షత కార్యక్రమంలో భాగంగా మూడవరోజు మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ డాక్టర్ సత్యసారదాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీమతి కొండ సురేఖ మాట్లాడుతూ అన్నిటికన్నా గొప్పదానం విద్యాదానం అని, సమాజంలో ఉపాధ్యాయుల పట్ల గౌరవం ఉందని ఉపాధ్యాయులు చెప్పిన మాటలు విద్యార్థులను ప్రభావితం చేస్తాయన్నారు. విద్యార్థులకు వారి స్థాయికి అనుగుణంగా వారిలో ఆసక్తిని పెంపొందించే విధంగా బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. శిక్షణలు నేర్చుకున్న నైపుణ్యాలను తరగతి గదిలో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి దోహదపడేలా చూడాలన్నారు. విద్యాబోధనే కాకుండా క్రీడలలో కూడా విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసి వారిని రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ క్రీడాకాలుగా తయారు చేయాలన్నారు. తమ ప్రభుత్వం మాత్రం విద్య వ్యవస్థకు పెద్దపీట వేస్తుందని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు చేపడుతోందని అన్నారు. విద్యార్థుల వసతి గృహాల డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీల పెంచిందని అన్నారు. కుల మతాలకతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించుటకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ లను ఏర్పాటు చేస్తున్నట్లు అందులో భాగంగా ఉర్స్ కరిమాబాద్ లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైద్రాబాద్ లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్ష ఇస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయులకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు బోధించే పద్ధతులను మెరుచుకుపరుచుకోవాలని నూతన గీతికతలను ఉపయోగించి విద్యార్థుల అవసరాల కనుగుణంగా బోధన పద్ధతులను మార్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తారని మంచి ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థుల పురోగతిని అంచనా వేసి వారిలో నైపుణ్యాలను మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్ తేజ అసిస్టెంట్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు సెంటర్ ఇన్చార్జ్ వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలానికి ముందే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా లెక్టర్ పి.ప్రావీణ్య**

హనుమకొండ జిల్లా, మే 15 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా వర్షాలు పడక ముందే పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని గోదాంల వద్ద నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఇప్పుడు వరకు చేపట్టిన ధాన్యం కొనుగోలు, ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో ఎన్ని మిల్లులు ట్యాగ్ అయి ఉన్నాయి, ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలకు డబ్బులు జమా అవుతున్నాయా, ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఇంకా ఎన్ని గన్నీ బ్యాగులు ఉన్నాయి, ఒక్కో గన్ని బ్యాగుకు ఎంత ధర పడుతుందనే వివరాలను అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఇదే మండలంలోని వీర నారాయణపూర్ లో తొలి విడత మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ గ్రామానికి చెందిన లబ్ధిదారులు సౌందర్య, సుశీల ఇండ్ల నిర్మాణానికి మెటీరియల్ను ఎక్కడినుండి తీసుకు వస్తున్నారు, ఇప్పటివరకు ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చయిందని, ఎప్పటి వరకు పూర్తి చేస్తారని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒకే రేటు ప్రకారం చేస్తున్నారా లేదా అని లబ్ధిదారులతో మాట్లాడి కలెక్టర్ తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు బేస్ మెంట్ లెవెల్ వచ్చాయని, ఆ దశకు వచ్చిన వాటిని బిల్లు చెల్లింపు కోసం ఆన్లైన్ చేస్తున్నారా, ఈ గ్రామంలో ఎన్ని ఇండ్లు మంజూరయ్యాయని, ఇంకా మొదలుపెట్టని ఇండ్లను ఎప్పటినుండి ప్రారంభిస్తారని గృహ నిర్మాణ శాఖ డి ఈ సిద్ధార్థ నాయక్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులతోనూ జిల్లా కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మీడియాతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, జిల్లాలో ఇప్పటివరకు 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు దాదాపుగా 150 కోట్ల రూపాయలను చెల్లించినట్లు పేర్కొన్నారు. రెండు వారాలలో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా వీరనారాయణపూర్ లో మొదటి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. బేస్మెంట్ లెవెల్ పూర్తిచేసి ఆన్లైన్ అయిన ఇండ్ల నిర్మాణాల లబ్ధిదారులకు బిల్లు చెల్లించడం జరిగిందన్నారు. వివిధ మహిళా వీవో గ్రూపుల ద్వారా లబ్ధిదారులు బేస్మెంట్ లెవెల్ పూర్తి చేసుకునే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మిగతావి కూడా త్వరలో ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఇన్చార్జి జిల్లా అదనపు కలెక్టర్ మేన శ్రీను, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



# చంద్రుగొండలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 15 (తీన్మార్ న్యూస్): చండుగొండ మండలంలో మంగయ్య బంజర, పోకల గూడెం మరియు రావికంపాడు గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ విస్తృతంగా పర్యటించి, గ్రామాల్లో చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణం, ఫారం పౌండ్స్, కమ్యూనిటీ పశుశాల నిర్మాణ పనులను పరిశీలించారు. చంద్రుగొండ మండలంలో పర్యటనలో భాగంగా ముందుగా కలెక్టర్ మంగయ్య బంజర గ్రామపంచాయతీ పరిధిలోని మాలోతు పకీరీ వ్యవసాయ క్షేత్రంలో నిర్మిస్తున్న పారం పౌండ్ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ భూగర్భ జలాలు పెంపొందించడానికి, భవిష్యత్ తరాలకు నీటి ఎద్దటి నివారించడానికి ఫామ్ పౌండ్ నిర్మాణం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ ఫామ్ పౌండ్ నిర్మాణం ద్వారా భూగర్భ జలాల అభివృద్ధి చెందటంతో పాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో కొంతమంది రైతులు ఫామ్ పౌండ్ లలో చేపల పెంపకం లో విజయం సాధించారని, అందరూ వారిని ఆదర్శంగా తీసుకొని లాభాలు గడించాలన్నారు. అనంతరం తోకల గూడెం గ్రామపంచాయతీలో ఉపాధి హామీ కూలీల ద్వారా నిర్మిస్తున్న పొలం బాటను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న కూలీలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలకు అవసరమైన పలుగులు, పారలు అందజేస్తామన్నారు. కూలీలతో ముచ్చటిస్తూ వారితో పాటుగా పలుగు, పార చేతబట్టి కలెక్టర్ పని చేశారు. పోకల గూడెం పంచాయతీ పరిధిలో లో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించారు. రావికంపాడు గ్రామపంచాయతీ నందు నిర్మిస్తున్న కమ్యూనిటీ పశుశాల పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెట్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అదే గ్రామంలో పలువురు రైతులు సాగు చేస్తున్న మునగ సాగును పరిశీలించి, రైతులకు అంతర్ పంటలు వేయడం ద్వారా రైతులు ఏ విధంగా ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు వివరించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఎంపీడీవో అశోక్, ఏవో నవీన్, ఎంపీ ఓ ఖాన్, ఏపీవో శ్రీను మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాళ్లకు కడుక్కోవడానికి నీళ్లను అందిచడం క్లియర్ గా ఉంది

**అతిథులను గౌరవించడం తెలంగాణ ప్రజల సాంస్కృతి**

**ఈవెంట్లో విజివల్స్ కళ్ళు పెద్దవిగా పెట్టుకొని చూడు బడే జ్యోతి**

**జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగా కళ్యాణి**



ములుగు, మే 15 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలోనీ అందాలను చూడడానికి వచ్చిన విదేశి అతిథులను గౌరవించి వాళ్ళ కాళ్లకు కడుక్కోవడానికి నీళ్లను అందిచడం క్లియర్ గా వుంది. వచ్చిన 32 మందిలో ఆ యొక్క ఈవెంట్ చేస్తున్న వాళ్లు అత్యుచ్ఛహంతో ఒకరికి నీళ్లు పోశారు కానీ మీరు అన్నట్టుగా కాంగ్రెస్ సర్కార్ చేస్తే 32 మందికి చేయాలి కానీ చేయలేదు, దాన్ని మీరు గుర్తుకు చేసుకోవాలి. కాళ్ళు టవల్ తో తుడిచారు అని అంటున్నవ్ బడే జ్యోతి నీ కళ్ళు ఎక్కడ పెట్టుకొని చూస్తున్నావ్ అతిథిగా వచ్చిన వారే తుడుచుకున్నారు తెలియకపోతే మళ్ళీ ఒక్కసారి ఆ యొక్క విజువల్స్ చుస్కో, నిన్న జరిగిన ఈవెంట్ విజయవంతం అయ్యింది అని ఓర్చుకోలేక ఇలా పిచ్చి పిచ్చి గా మాట్లాడటం పద్ధతి కాదు. మీ నాయకుడు లాగా ఇవాంకా ట్ర%శీ%ప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరగింది నిజం కాదా.. మి నాన్న దొర పెత్తం దారులతో పోరాడిన వారు అని చెప్పుకున్న నువ్ దొర కాళ్ళ కు నమస్కారం చేయడం సిగ్గుగా లేదా బడే జ్యోతి...మీ దొర గతం లో వరి వేస్తే ఉరే అన్నది నిజం కాదా...? మా ప్రభుత్వం లో వరి సాగు కు సన్న వడ్ల కు 500 రూపాయలు బోనస్ ఇస్తున్నాం... రైతన్న లకు అన్యాయం జరగొద్దు అని రైస్ మిలర్లు జాప్యం చేయకుండా ఏ సమస్య వచ్చిన టోల్ ఫ్రీ నెంబర్ కూడ పెట్టడం జరిగింది. రైతన్నల సమస్య లపై నిత్యం అధికారుల తో రివ్యూ మీటింగ్ లతో పాటుగా రెండు రోజుల కొకసారి జిల్లా కి వచ్చి ప్రతి సమస్య ను తెలుసుకొని పరిష్కారం చేస్తున్నా మంత్రి సీతక్కని విమర్శ చేసే స్థాయి నీకు లేదు బడే జ్యోతి. పెద్దలను గౌరవించడం తెలుసుకో బడే జ్యోతి మంత్రి సీతక్క పేరు ఆన్ రికార్డ్ ఎక్కడ చుసిన కూడ సీతక్క అనే ఉంటుంది వుంది సీతమ్మ అని నువ్ సంభోదించడం నీ అహంకారం పద్ధతి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు అన్నారు.

# అసత్యపు ప్రచారాలు మానుకోవాలి

**ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం వృధా**

**అభివృద్ధిని ఆపాలనే ప్రయత్నం అసాధ్యం**

**మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి.శ్రీనివాస్**



వెంకటాపూర్, మే 15 (తీన్మార్ న్యూస్): బుధవారం (నిన్న) ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయ ప్రాంగణంలో ఎంతో అంగరంగవైభవంగా జరిగిన ప్రపంచ సుందరీమణుల పర్యటనలో భాగంగా వారి కాళ్లకు మర్యాదపూర్వకంగా సుందరీమణుల ప్రత్యేక స్వీయరక్షకులు నీటిని అందించి, వారి పాదాలను కడుగగా, అది తప్పుడు దారి పక్కదారి పట్టించేందుకు కొన్ని పేపర్ వాళ్ళు అమ్ముడిపోయి దానిని ప్రభుత్వం తప్పిదముగా చిన్నపిల్లలతో కాళ్లు కడిగించారని ప్రకటనలు జారీ చేశారు. ఇది కేవలం ప్రభుత్వంపై, సీతక్క పై కుట్రపూరిత రాజకీయంచేసి, బురదజల్లే వేషాలుతప్పా మరేదీ లేదని, ఇది ముమ్మాటికీ అభివృద్ధిని ప్రక్కదోవ పట్టించటానికి తప్పా ఇందులో ఎటువంటి సంశయం లేదు. అలాగే, ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను, దేవాలయ విశిష్టతను ప్రపంచ సుందరీమణుల ద్వారా ప్రచారం జరుగుతోందని వారిని ప్రత్యేకంగా ఆహ్వానించటం మరియు ఇంకా ఎన్నో, మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడానికి ఇది ఒక మెట్టుగా భావించి, సీతక్క ప్రయత్నం చేస్తున్న తరుణంలో, దానిని ఓర్వలేక కావాలనే కుట్ర పన్నుతూ ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారు. కాబట్టి, అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడిని ఆపలేరు. అలాగే, మీరు పన్నాగాలు పన్నినా, ఎన్ని కుట్రలు చేసినా ములుగు అభివృద్ధిని చేసే దిశగానే సీతక్క అడుగులు వేస్తారు వారివెంట ఎల్లప్పుడూ మేము నడుస్తామని వెల్లడించిన మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి.శ్రీనివాస్ అన్నారు.

# మైనార్టీ గురుకుల అడ్మిషన్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్




హన్మకొండ జిల్లా, మే 15 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం తాను కలెక్టరేట్లోని చాంబర్లో మైనార్టీ గురుకుల పాఠశాలల అడ్మిషన్లకు సంబంధించిన ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. హన్మకొండ జిల్లాలో మొత్తం మూడు బాలుర గురుకుల పాఠశాలలు మరియు ఒక బాలికల గురుకుల పాఠశాల ఉన్నాయని పేర్కొన్నారు. మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో DMWO మురళీధర్ రెడ్డి, ఆర్ఎల్సీ శ్రీనివాస్ తనుగుల, గురుకుల ప్రిన్సిపాళ్లు సతీష్, నీరజ, మరియు శిరీష పాల్గొన్నారు.

# కార్పోరేట్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానము

జనగామ జిల్లా, మే 15 (తీన్మార్ న్యూస్): 2025-26 విద్యా సంవత్సరములో కార్పోరేట్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల తేది 31.05.2025 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి తెలియపరచారు. ఎస్.సి. ఎస్.టి, బి.సి., పి.హెచ్.సి. https://telanganaepass.egg.gov.in మరియు మైనారిటీ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగలరని తెలియజేసారు. ఈ అవకాశం మార్చి 2025 లో పదవ తరగతిలో ఉత్తీర్ణులు అయి GPA 7.0/400 ఆ పైన సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులు. ఇట్టి కార్పోరేట్ కళాశాలలో ప్రవేశానికి ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, తెలంగాణ రెసిడెన్సియల్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠ శాలలు, బెస్ట్ అవైలబుల్, నవోదయ పాఠశాలలు, తెలంగాణ ఆదర్శ పాఠశాలలు మరియు కస్తుర్బా పాఠశాలలో చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులు. కావున విద్యార్థిని/విద్యార్థులు పైన తెలిపిన ప్రకారము ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా వారి వారి పేర్లు తక్షణమే నమోదు చేసుకోగలరు.

**ముఖ్యమైన తేదీలు:**

1 దరఖాస్తులు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు తేది 17.05.2025 నుండి 31.05.2025 వరకు:

2. సెలక్షన్ లిస్టు తేది 05.06.2025,

3. ఎంపికైన విద్యార్థుల ధ్రువ పత్రముల పరిశీలన మరియు కళాశాల అలాట్మెంట్ ఆర్డర్స్ పొందుట ః 10.06.2025.

# సరస్వతి పుష్కర వైభవం

తెలంగాణ బ్యూరో, మే 15 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమవ్వగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ తదితరులు జ్ఞానసరస్వతి పుష్కర ఘాట్ వద్ద పుష్కరస్నానం ఆచరించారు. అనంతరం నదీమతల్లికి హారతినిచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల సరస్వతీదేవి విగ్రహం, భక్తుల వసతికోసం నిర్మించి 86 గదులను సీఎం రేవంత్ ప్రారంభించారు. సరస్వతి ఘాట్‌లో సరస్వతి నదికి ఇచ్చే నవరత్న మాలహారతిని, కళా, సాంస్కృతిక కార్యక్రమాలను సీఎం, మంత్రులు తిలకించారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే త్రివేణి సంగమం వద్ద ఈ నెల 26వ తేదీవరకూ ఈ పుష్కరాలు జరగనున్నాయి. కాగా సరస్వతీ పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రోడ్ల మరమ్మతులు, పార్కింగ్ వంటి ఏర్పాట్లు చేశారు. గురువారం సరస్వతి పుష్కరాలకు సా. 4.12 నిమిషాలకు కాళేశ్వరం విచ్చేసిన ముఖ్యమంత్రి భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టెంట్ సిటీని పరిశీలించారు. అనతరం

17 అడుగుల ఏక శిలా సరస్వతి మాతా విగ్రహాన్ని ఆవిష్కరించారు. సరస్వతి ఘాట్ ను ప్రజలకు అంకితం చేశారు. తదుపరి పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని, శుభానందదేవిని, ప్రౌఢ సరస్వతి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనతరం సరస్వతి ఘాట్ లో పుష్కరాలపై భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నా హయంలో ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో అయినా నదులను పూజించడం మన సంస్కృతి, సంప్రదాయమని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరడం జరిగిందిలని, మంథని నియోజకవర్గానికి పెద్ద చరిత్ర ఉన్నదని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఆద్యుడు పివి నరసింహారావు మంథని వాసి అన్నారు. ప్రపంచంలో మన దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేసిన పీవీ నరసింహారావు మంథని బిడ్డ, తదుపరి శ్రీపాదరావు ప్రాతినిధ్యం వహించారని అన్నారు. శ్రీపాద రావు సభను ఎంతో హుందాగా నడిపించారని తెలిపారు. రాష్ట్రంలో లక్షల కోట్లు విదేశీ, స్వదేశీ పెట్టు బడులను పెట్టించడం, ప్రైవేట్ రంగంలో వేల కోట్ల పెట్టు బడులను తేవడం రాష్ట్రం అభివృద్ధిలో శ్రీధర్ బాబు కృషి చాలా గొప్పదని అన్నారు. మంథని నియోజక వర్గ అభివృద్ధికి, నిరంతరం కష్ట పడే శ్రీధర్ బాబును ప్రజలే కాపాడు కోవాలన్నారు. ఆయన సేవలు రాష్ట్రం యావత్తు అవసరమని, ఆయన నియోజకవర్గ అభివృద్ధి కి తక్కువ సమయం కేటాయింపు చేసి రాష్ట్ర అభివృద్ధికి ఎక్కువ సమయం కేటాయించాలని తెలిపారు. శ్రీధర్ బాబు రోజుకు 18 గంటలు పని చేస్తున్నారని కొనియాడారు. కాళేశ్వరం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ చేయాలని మంత్రి కోరారని, కానీ 100 కోట్లు కావాలని అడిగార నేను 200.కోట్లు ఇస్తానని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోనే కాళేశ్వరాన్ని గొప్పగా అభివృద్ధి చేయాదానికి వంద కాదు, రెండు వందల కోట్లు కేటాయించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా అన్నారు. గోదావరి, కృష్ణా పుష్కరాలను, సమ్మక్క సారాలమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున గ్రీన్ ఛానల్ లో నిధులు విడుదల చేస్తా అన్నారు. మంథని నియోజక వర్గం ప్రజలు అదృష్టంగా గర్వంగా ఫీలయ్యే నాయకుడు మంత్రి శ్రీధర్ బాబు అని, తప్పకుండా మంథని నియోజక వర్గం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను, ఇతర శాఖల అధికారులను అభినందించారు.












కాళేశ్వరం సరస్వతి నవరత్నమాల స్తోత్రంతో తొమ్మిది హారతులు
ఓంకార హారతి సర్వ దోష నివారిణి
నాగ హారతి సర్పదోషాని పోగొట్టి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది
పంచ హారతి దీర్ఘాయుష్షుకు
సూర్య హారతి రోగాలను మాపి ఆరోగ్యాన్ని ఇస్తుంది.
చంద్ర హారతి పాడి పంటలను, మన: శాంతినిస్తుంది.
నంది హారతి ధర్మ బుద్ధిని, శక్తిని, విద్య బుద్ధినిస్తుంది.
సింహ హారతి నాయకత్వాన్ని ధైర్యాన్నిస్తుంది.
కుంభ హారతి సంపదను ఇచ్చి, కోటి సుఖాలను అందిస్తుంది.
నక్షత్ర హారతి నిర్మలమైన మనస్సును, కీర్తిని అందిస్తుంది. పై హారతులు వారణాసి కాశీలో గంగా హారతి లుఇచ్చే 7 గురు పండితులచే చేయడం జరిగింది. దాదాపు అరగంటపాటు జరిగిన ఈ 9 హారతులు ఆహుతులను మైమరపింప చేశాయి

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, మే 15 (తీన్మార్ న్యూస్): ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం, జిల్లాలోని కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధ్యక్షతన మే - 2025 ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలపై సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మే - 2025 ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు (థియరీ) ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి ఏడాది పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకని, రెండో ఏడాది పరీక్షలు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరగనున్నాయన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన (10) పరీక్ష కేంద్రాల్లో (2383) మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, (1560) రెండవ సంవత్సరం విద్యార్థులతో కలిపి మొత్తం (3943) మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని వెల్లడించారు. ఈ మేరకు (10) మంది చీఫ్ సూపరింటెండెంట్లు, (10) మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, (01) అదనపు చీఫ్ సూపరింటెండెంటు, (01) కస్టోడియన్, (01) ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించామన్నారు. నిర్దేశించిన మూడు మార్గాల ద్వారా ప్రశ్నపత్రాలను ఆయా పరీక్ష కేంద్రాలకు పటిష్ట భద్రత నడుమ చేరవేయాలన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో నిఘా నేత్రాలను (సీసీ కెమెరాలు) సరిచూసుకోవాలన్నారు. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా అధిక సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది సరిపడా ఔషధ నిల్వలతో కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. అలాగే %షషఙ.ంఎఅవ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ% ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అదే విధంగా దివ్యాంగ విద్యార్థులకు స్క్రైబ్ సౌకర్యాన్ని కల్పించాలని, అందుకు సంబంధించిన పత్రాలను సమర్పించాలని, ప్రతి కేంద్రంలో ర్యాంప్ వసతి, తదితర మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. విద్యార్థులు ఏమైనా సందేహాలు ఉంటే టెలీ మానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416లో సంప్రదించాలని, తమ సమస్యలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ సమన్వయ సమావేశంలో డీఐఈఓ జితేందర్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులపై సమగ్ర విచారణ చేపట్టాలి

**వారంలోగా రేషన్ కార్డుల పరిశీలన పూర్తి చేయాలి**

**ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి**

**టెలి కాన్ఫరెన్స్ లో అధికారులతో జిల్లా కలెక్టర్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 15 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం కింద రైతులు, ప్రజల నుంచి ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరిపిన మీదట, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం పెండింగ్ భూభారతి దరఖాస్తులు, రేషన్ కార్డులు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరియు పెండింగ్ ఎలక్షన్ దరఖాస్తులు పై సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1679 భూభారతి దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పెండింగ్ దరఖాస్తులు వివరాలను నివేదిక సమర్పించాలని ఏ స్థాయిలో ఎన్ని రోజులు దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి అన్న వివరాలు తెలియ పరచాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ అధికారులు పారదర్శకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపరిచిన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు తలొగ్గకుండా భూభారతి దరఖాస్తుల విచారణలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందరూ అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజా పాలన మరియు మీ సేవ ద్వారా వచ్చిన రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలన వారంలోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్ని సంక్షేమ పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటుందని, కాబట్టి పేదలకు అందించే సంక్షేమ పథకాల మంజూరులో రేషన్ కార్డు కీలకం అందువలన రేషన్ కార్డు కోసం చేసుకున్న దరఖాస్తు ల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతి దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి, కొత్త రేషన్ కార్డులు మరియు అదనపు కుటుంబ సభ్యుల జతపరచటం, చనిపోయిన వారి పేర్లను తీసివేయడం వంటివి త్వరితగతను పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఎంత ఉంది సరిపడా బ్యాగులు అందుబాటులో ఉన్నాయా లేదా ధాన్యం రవాణా అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తరలించడానికి ఎన్ని లారీలు అవసరమవుతుందో అంచనా వేసుకుని దానికి తగినట్టుగా రవాణాకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వాహనాలలో దాన్యం లోడింగ్ చేయుటకు సరిపడా హమాలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తాసిల్దార్లను ఆదేశించారు. ఎక్కడైనా ధాన్యం రవాణా లో ఇబ్బంది కలిగితే పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలియపరచి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కేవలం ధాన్యంలోని తేమను చూడటం మాత్రమే కాకుండా, రంగు మారిన ధాన్యం గుర్తించి ఆ ధాన్యాన్ని విడిగా లారీలలో కాకుండా ట్రాక్టర్ ద్వారా మిల్లర్లతో సమన్వయ చేసుకొని రవాణా చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అవకతవకలకు లేదా అలసత్వం ప్రదర్శించిన కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఎన్నికల దరఖాస్తులు ఫారం 6, 7 మరియు 8 లను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.





# శాంతి మంత్రాలకు చింతకాయలు రాలవు!

భారత్‌తో యుద్ధం గెలిచామని తమ సొంత ప్రజలను నమ్మించేందుకు పాక్ చేయని ప్రయత్నం లేదు. చివరకు విజయోత్సవాలను కూడా నిర్వహించుకుంది. ట్రంప్ కూడా తనవల్లనే యుద్ధం ఆగిందని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రచార కండూతి ఇద్దరిలోనూ కనిపిస్తోంది. అయితే ఇందులో ఏది నిజమో భారత్‌ను చూస్తే తెలుస్తుంది. పాక్ ఎందుకు కాళ్లబేరానికి వచ్చిందో చెప్పాలి. ప్రపంచాన్ని బెదిరించి పబ్బం గడుపు కునే దుస్థితిలో ట్రంప్ ఉన్నారు. అడుక్కుతినే దుస్థితిలో పాక్ ఉంది. ఇండియా పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం కాల్పులు మొదలైన మూడు రోజులకే ముగిసిన సంగతి తెలిసిందే. ఎందుకు ముగిసాయన్నది పాక్‌కు బాగా తెలుసు. భారత్ కొట్టిన దెబ్బకు పాక్ కూసాలు కదిలిపోయాయి. మిస్సైల్స్, డ్రోన్ల దాడి కారణంగా భారీ ఆస్తినష్టం సంభవించింది. ఒకరకంగా పాక్‌పై కోలుకోలేని దెబ్బ పడింది. యుద్ధం ఇలాగే కొనసాగితే దేశం సర్వ నాశనం అవుతుందని పాక్ భావించింది. వెంటనే కాళ్ల బేరానికి వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సాయంతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీంతో కాల్పుల కొనసాగింపు ఆగిపోయింది. అయితే భారత్ మాత్రం ఆపరేషన్ సింధూర్ నిలిచి పోయిందని, ఎప్పుడైనా కొనసాగుతుందని గట్టిగా హెచ్చరించింది. మోడీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం తరవాత దేశంతో పాటు, ప్రపంచానికి కూడా భారత్ సత్తా ఏమిటో మరోమారు తెలిసిపోయింది. ఇండియా దెబ్బకు తోకముడిచిన కుక్కలా పాకిస్తాన్ బిక్కచచ్చిపోయింది. దాడులు, కాల్పుల విరమణ కోసం పరుగులు తీసింది. యుద్ధంలో పాకిస్తాన్ దారుణంగా దెబ్బతింది. ఇండియా డిప్లమేటిక్‌గా.. మిలటరీ పరంగా విజయం సాధించింది. ఇండియా ఎందుకు విజయం సాధించిందనే దానికి పటిష్టమైన నాయకత్వం, మిటిటరీ ఆధునీకరణ అని చెప్పక తప్పదు. గత కొన్ని వేల సంవత్సరాలుగా పరాయి పాలనలో మగ్గిన భారత్ స్వయం సమృద్ధి సాధించి, సైనికంగా బలోపేతం అయ్యింది. ఎదుటి వారు దాడిచేస్తే దెబ్బ కొట్టాల్సిందేనన్న లక్ష్యంతో పనిచేస్తోంది. చెంపకుచెంప కాదు...కాల్లు విరగ్గొడతామన్న ధైర్యాన్ని చూపిస్తోంది. ఈ విషయం పాకిస్తాన్‌కే బాగా తెలుసు. వరుసగా ఉగ్రదాడులతో భారత్‌ను దెబ్బకొట్టాలని చూసిన పాక్ ఇప్పుడు దెబ్బతింది. ఇక జీవితంలో మరువలేని అనుభవాన్ని సంపాదించింది. ఇకనుంచి ఉగ్రదాడులకు దాడులతోనే భారత్ సమాధానం చెబుతుందన్న విషయం ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఇకపోతే ఇప్పుడు అందరి చూపు.. పాకిస్తాన్ టెర్రరిస్టులను పెంచి పోషిస్తున్న విషయం వైపే ఉంది. టెర్రరిస్టులు చనిపోయినపుడు ఆర్మీ అధికారులు యూనిఫామ్‌లో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంటే దానర్థం.. అక్కడి టెర్రరిస్టులకు.. ఆర్మీ వాళ్లకు తేడా లేదని. పాక్ చరిత్ర గురించి బాగా తెలిసిన వారు..ఈ రెంటికీ విడదీయరాని సంబంధం ఉందని గుర్తించారు. ఇండియాతో యుద్ధం చేసి ఓడిపోయిన ప్రతీసారి తామే గెలిచామని పాకిస్తాన్ జబ్బలు చరుచుకుంటోంది. అందుకే ఉగ్రవాదులకు ఊతమిచ్చే చర్యలను పక్కన పెట్టి పాకిస్తాన్ తన సొంత ఇంటిని శుభ్రం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక బంగ్లా యుద్ధంనాటి 1971తో పోల్చితే మన దేశం ఆర్థికంగా ఎన్నో రెట్లు బలపడింది. మన సైనిక శక్తి పాటవాలు కూడా అనేక రెట్లు పెరిగాయి. అందుకే డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులు చేసినప్పటికీ సమర్థంగా తిప్పి కొట్టాం. అలాగే ప్రతిదాడితో దాని పక్కటెముకలను విరగొట్టాం. మనవైపు చెప్పుకోదగిన నష్టం ఏమీ జరగలేదు. అంతర్జాతీయ సమీకరణాలు... 1971లో పాక్‌కు దన్నుగా అమెరికా, బ్రిటన్, చైనా వంటి దేశాలు నిలవగా... మన దేశానికి సమైక్య రష్యా మాత్రమే అండగా ఉండింది. ఇప్పుడు వాతావరణం మారింది. భారత్ శాస్త్ర సాంకేతికరంగంలో దూసుకు పోతోంది. భారతదేశం కూడా బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. దీంతో భారత్ నుంచి ముప్పు తప్పదని భావించిన చైనా మనతో శత్రుత్వం పెంచుకుంటోంది. చైనాకు సామంత దేశంగా ఉండటానికి భారత్ ఎప్పటికీ అంగీకరించదు. ఈ కారణంగా చైనా వ్యూహాత్మకం గా పాకిస్థాన్‌ను చేరదీస్తోంది. దాయాది దేశానికి వివిధ రూపాల్లో సహాయం చేస్తోంది. మొన్నటికి మొన్న కూడా సైనికి సాయం చేసి భంగపడింది. అందుకే అరుణాల్ విషయంలో పేచీలు పటెట్ఇ కెలక్కుంటోంది. ఇక అమెరికా కూడా చైనా ఎదుగుదలను నిరోధించే క్రమంలో దానితో సై అంటోంది. భవిష్యత్తులో చైనాతో తలపడాల్సి వస్తే భౌగోళికంగా పాక్ భూభాగం అమెరికాకు కావాలి. ఈ కారణంగా ఉగ్రవాదంపై తమది రాజీ లేని పోరు అంటూనే అమెరికా దొడ్డి దారిన పాకిస్థాన్‌కు సహాయం చేస్తోంది. ఈ నేపథ్యంలో సైనికపరంగా అత్యంత శక్తిమంతంగా ఉన్న రష్యా మాత్రమే ఎప్పటికైనా మనకు అంతో ఇంతో అండగా నిలవొచ్చు. పశ్చిమ దేశాలతో ఉన్న వైరం కారణంగా రష్యా కూడా చైనాకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరించే పరిస్థితి లేదు. ఈ కారణంగానే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు ఆర్థిక సహాయం చేయవద్దని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకు భారత్ విజ్ఞప్తి చేసినా..డే వంద కోట్ల డాలర్ల సహాయం అందించడానికి అంగీకారం తెలిపింది. యుద్ధాలను భరించే స్థితిలో ప్రపంచ దేశాలు ఇప్పుడు లేవు. ఐదు దశాబ్దాల క్రితం పరిస్థితులు వేరు. అప్పుడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కూడా లేవు. 1971 యుద్ధ సమయంలో అంతర్జాతీయ పరిణామాలు మన దేశ ప్రజలపై ప్రభావం చూపలేదు. ఇప్పుడు మన దేశం నుంచి ఎగుమతులు, దిగుమ తులు కూడా పెరిగాయి. ఇప్పుడంతా అభివృద్ధి, అర్థిక వృద్ధిపైనే అన్ని దేశాలు దృష్టి సారిస్తున్నాయి. పాక్ ఇందుకు భిన్నంగా ఉగ్రవాదులను ఎగదోస్తోంది. ఇలా ఎంతకాలం చేసినా అది మనుగడ సాగించదని గుర్తిస్తే మంచింది. అలా అని పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పకుండా ఉండలేం. మన దేశంతో యుద్ధం చేసి నెగ్గలేని పాకిస్థాన్ ఉగ్ర మూకలను పెంచి పోషించి మనపైకి ఉసిగొల్పుతోంది. తృతీయ ఆర్థిక శక్తిగా ఎదగాలను కుంటున్న భారత్‌కు ఈ యుద్ధం ప్రతిబంధకమే అవుతుంది. అలా అని చేతులు ముడుచుకొని కూర్చోలేని స్థితి. కశ్మీర్ అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన పర్యాటకులను వారి భార్యల కళ్లెదుటే కాల్చి చంపిన ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం ద్వారా మన దేశాన్ని పాకిస్థానే యుద్ధ రంగంలోకి లాగింది. పాముకు పాలు పోసి పెంచితే అది ఏదో ఒకరోజు మనల్నే కాటేస్తుంది. పాకిస్థాన్‌కు కూడా ఈ పరిస్థితి ఎదురవుతోంది.

# పాక్ అణ్వాయుధాల గుట్టు తేల్చాలి

**న్యూఢిల్లీ, మే 15 :** బాధ్యతలేని, దుష్ట పాకిస్థాన్ వద్ద అ ణ్వాయుధాలు ఉండడం ఎంత వరకు క్షేమం అని ప్రపం చ దేశాల్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు. కాశ్మీర్‌లో పర్యటించిన సందర్భంగా శ్రీనగర్‌లోని బాదామి బాగ్ కంటోన్మెంట్‌లో గురువారం ఆయన మాట్లాడారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ వద్ద న్యూక్లియర్ ఆయుధాలు ఉండడం ఎంత వరకు సమంజసం అని రాజ్‌నాథ్ అడిగారు. అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ .. పాకిస్థాన్ అణ్వాయుధాలను తన ఆధీనంలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ సిం ధూర్ సమయంలో జరిగిన దాడిలో.. కిరానా హిల్స్ సమీపంలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌ను భారతీయ వైమాని క దళాలు దాడి చేశాయి. అయితే ఆ ఎయిర్‌బేస్ వద్ద న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను పాకిస్థాన్ దాచిపెట్టినట్లు తెలు స్తోంది. దాడి జరగడం వల్ల ఆ న్యూక్లియర్ వార్‌హెడ్స్ నుంచి అణుధార్మికత రిలీజ్ అవుతున్నట్లు- ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో శ్రీనగర్ పర్యటనలో రక్ష ణ మంత్రి తన ప్రసంగంలో ఆ అంశాన్ని ప్రస్తావించారు. పెహల్గామ్ దాడి తర్వాత జమ్మూకశ్మీర్ ప్రజల్లో పాకిస్థాన్, ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తం అయ్యిందని, జమ్మూకశ్మీర్ ప్రజలకు సెల్యూట్ చేస్తున్నానని, శుత్రవులను నాశనం చేసిన శక్తి ఇక్కడ ఉందని, పాకిస్థానీ చౌకీలు, బంకర్లను ధ్వంసం చేసిన తీరుతో శత్రుదేశం షాక్‌కు గురైందన్నారు. కిష్టమైన పరిస్థితుల్లో ఇక్కడ మీతో ఉండడం గర్వంగా భావిస్తున్నానని, ఆపరేషన్ సింధూర్ సమయంలో మీరు చేసిన పనిపట్ల దేశంగర్వంగా ఉందన్నారు. రక్షణ మంత్రి కన్నా ముందు తాను దేశ పౌరుడినని, ఓ మంత్రిగానే కాకుండా, ఓ పౌరుడిగా ధన్యవాదాలు చెబుతున్నట్లు రా జ్‌నాథ్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న రాజ్‌నా థ్‌కు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. ఉగ్ర శిబిరాలు ఎక్కడ ఉన్నా నాశనం చేస్తామని చెప్పారు. టెర్రరిస్టులతో పోరాడి ప్రాణత్యాగాలు చేసిన జవాన్లకు నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదని.. అదొక కమిట్‌మెంట్ అని పేర్కొన్నారు. భారత్‌పై ఉగ్రదాడి జరిగితే.. దానిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామన్నారు. మన దళాలు అద్భుతంగా పోరాడుతున్నాయని పేర్కొన్నారు. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా వారి మధ్య ఉన్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు ఆయన నివాళులర్పించారు. ఇక ఈ పర్యటనలో భాగంగా పాకిస్థాన్ షెల్లింగ్‌లో దెబ్బతిన్న ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఇక మన దళాల సంసిద్ధతను ఆయన పర్యవేక్షించనున్నారు. దీనిలోభాగంగా చినార్ కోర్ ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించి.. ఆర్మీ, వాయుసేన సిబ్బందితో మాట్లాడనున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ మంత్రి జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. అంతకుముందు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కూడా జమ్మూకశ్మీర్‌లోనే పర్యటించారు. ఆయన నేడు చినార్‌కోర్‌లోని డాగర్స్ డివిజన్‌లోని అన్ని ర్యాంకుల అధికారులతో సమావేశమయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల వద్ద నిర్భయంగా, అప్రమత్తంగా ఉన్నారని అభినందించారు.



# ముందు వెళ్లి క్షమాపణలు చెప్పండి

## కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు .. మంత్రికి సుప్రీం ఆదేశాలు




**న్యూఢిల్లీ,మే15 :** సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ముందుగా క్షమాపణలు చెప్పాలని మధ్యప్రదేశ్ మంత్రిని సుప్రీం ఆదేశించింది. ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పండి. ఇలాంటి అంశాల్లో కాస్త సున్నితంగా వ్యవహరించం డని ఆగ్రహం వ్యక్తంచేసింది. పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. హైకోర్టు ఆదేశాల మేరకు ఆయనపై కేసు కూడా నమోదైంది. ప్రస్తుతం ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. హైకోర్టు ఆదేశాలపై ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంత్రి పిటిషన్‌ను శుక్రవారం విచారించేందుకు కోర్టు అంగీకరించింది. అంతేగాకుండా ఆయన తీరును తప్పుపట్టింది. ఎలాంటి మాటలు మాట్లాడుతున్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలను వెల్లడించిన కర్నల్ ఖురేషీని ఉద్దేశిస్తూ ఆమెను 'ఉగ్రవాదుల సోదరి' అని విజయ్ షా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇదికాస్త తీవ్ర దుమారం రేగడంతో మంత్రి వ్యాఖ్యలను హైకోర్టు బుధవారం సుమోటోగా తీసుకుంది. శత్రుత్వం, విద్వేషాన్ని ప్రోత్సహించినందుకు ఆయనపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని జస్టిస్ అతుల్ శ్రీధరణ్, జస్టిస్ అనురాధా శుక్లాలతో కూడిన ధర్మాసనం పోలీసులను ఆదేశించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి తమకు నివేదించాలని రాష్ట్ర డీజీపీని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ... దేశంలో ఇంకా సమగ్రత, క్రమశిక్షణ, త్యాగం, నిస్వార్థం, గౌరవం, అజేయమైన ధైర్యం నిండి ఉన్న సంస్థ ఒక్క సైన్యం మాత్రమేనని పేర్కొన్నారు. అటు జాతీయ మహిళా కమిషన్ కూడా మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న మహిళలపై ఇటు-వంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొంది. మంత్రి చేసిన వ్యాఖ్యలపై భాజపా సీనియర్ నాయకుడు ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ స్పందించారు. విజయ్ షాను 'మూర్ఖుడు' అని ఆయన సంబోధించారు. మరోవైపు విజయ్ షాపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రధాని మోదీని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది.

# పాక్ అదుపులో 21 రోజులపాటు నరకం

## కళ్లకు గంతలు కట్టి మాటలతో హింస

న్యూఢిల్లీ, మే 15: పాక్ రేంజర్ల నిర్బంధంలో గత 21 రోజులుగా ఉన్న సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణమ్ కుమార్ షా విడుదలైన సంగతి తెలిసిందే. పాక్ అదుపులో ఉన్నప్పుడు ఆయనను నిద్ర పోనివ్వలేదని, దూషించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నిర్బంధంలో ఉన్నన్ని రోజులు పాక్ అధికారులు పూర్ణమ్‌ను మూడు ప్రాంతాల్లో తిప్పి ఒక లొకేషన్‌లో జైలు సెల్‌లో ఉంచారు. వారివద్ద ఉన్నన్ని రోజులు చాలావరకు కళ్లకు గంతలు కట్టే ఉంచారని సమాచారం. ఆయనను శారీరకంగా హింసకు గురిచేయలేదు కానీ.. మాటలతో మాత్రం వేధింపులకు గురిచేశారని ఆ వర్గాలు వెల్లడించాయి. కనీసం నిద్ర పోనివ్వలేదని, బ్రష్ చేసుకోవ్వలేదని తెలిపాయి. అలాగే సరిహద్దులో మోహరింపు గురించి, అక్కడ ఉండే సీనియర్ అధికారుల గురించి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నాయి. కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలని ఆ అధికారులు ఒత్తిడి చేశారని తెలుస్తోంది. అయితే బీఎస్ఎఫ్ నిబంధనల ప్రకారం ఆయన వద్ద ఎలాంటి ఫోన్ లేకపోవడంతో వారికి వివరాలు అందలేదు. ఇక ఈ ప్రశ్నలన్నీ అడిగిన అధికారులు సివిల్ దుస్తుల్లో ఉన్నారని సమాచారం. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రైతులకు రక్షణగా గత నెల 23న గస్తీ నిర్వహిస్తున్న సమయంలో పూర్ణమ్ అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఓ చెట్టు- కనబడటంతో దానికింద విశ్రాంతి తీసుకున్నారు. అది పాక్ భూభాగం అన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. పాకిస్థాన్ రేంజర్స్ ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. జవాన్ విడుదల కోసం రెండు దేశాల భద్రతా దళాలు ఆరు సార్లు చర్చలు జరిపాయి. మరోవైపు పూర్ణమ్ కుటుంబసభ్యులు తీవ్రంగా ఆందోళన చెందారు. గర్భిణి అయిన ఆయన భార్య.. భర్త విడుదల కోసం కేంద్రాన్ని వేడుకున్నారు. కొన్నాళ్లపాటు- భారత్ అధికారుల అభ్యర్థనలు పట్టించుకోకుండా పాక్ రేంజర్లు కాలయాపన చేశారు. అయితే ఈనెల మొదటివారంలో రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో మన భూభాగంలోకి ప్రవేశించిన పాక్ రేంజర్ మహమ్మదుల్లాను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకుంది. దీంతో పాకిస్థాన్ పైనా ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలోనే పూర్ణమ్‌ను విడుదల చేసింది. బీఎస్ఎఫ్ కూడా పాక్ రేంజర్‌ను అప్పగించింది.

# ఈ అధికారం మీకెవరిచ్చారు?

- సుప్రీం తీర్పుపై ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి

**న్యూఢిల్లీ, మే 15:** తమిళనాడు గవర్నర్ విషయంలో తీర్పు సందర్భంగా రాష్ట్రపతిని కూడా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం తీరుపై రాష్ట్రపతి ముర్ము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధికారం మీకెవరు ఇచ్చారో చెప్పాలని స్పష్టం చేశారు. ఈ మేరకు పలు ప్రశ్నలను సంధించారు. శాసనసభలో ఆమోదించిన బిల్లులను పరిశీలన పేరుతో గవర్నర్లు, రాష్ట్రపతి నెలల తరబడి జాప్యం చేస్తుండటంపై ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న రాష్ట్రపతి, గవర్నర్లు గడువులోగా బిల్లులు ఆమోదించాల్సిదేనని ధర్మాసనం ఆదేశించింది. అయితే, తాజాగా అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని భారత ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తీవ్రంగా ఖండించారు. ఈ ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం ఎలా చెల్లుబాటు అవుతాయని సుప్రీంను ప్రశ్నిస్తూ 14 ప్రశ్నలను సంధించారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు రాష్ట్ర బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని తీర్పు వెలువరించింది. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదొకటి చేయాలని స్పష్టం చేసింది. బిల్లులు ఆమోదించకపోతే ఎందుకనే కారణాలు కచ్చితంగా చెప్పాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియాపరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబి పార్దివాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలో



అలాంటి నిబంధనేది లేనప్పుడు ఈ తీర్పు ఎలా ఇవ్వగలరని రాష్ట్రపతి ముర్ము అత్యున్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. జస్టిస్ జేబి పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఇచ్చిన 415 పేజీల తీర్పును సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన అధికారాలను ఉపయోగించి 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రపతి ముర్ము ఈ తీర్పుపై స్పందించడం గమనార్హం. రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలకు గల అధికారాల పరిమితిపై రాష్ట్రపతి ముర్ము సంధించిన ప్రశ్నలకు సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ముర్ము ప్రశ్నించినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు ప్రశ్నలు సంధించినట్లు- ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీనికి సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. వర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశిరచింది. బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు గల కారణాలనూ జత చేయాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది.




## నాలుగవ స్థానాన్ని ఎవరు

# భర్తీ చేస్తారు?

భారత దిగ్గజ క్రికెటర్ టెస్టు క్రికెట్ కు రిటైర్మెంట్ పలకడంతో అతని స్థానం నెం.4ను ఎవరు భర్తీ చేస్తారనేదానిపై సందేహాలు నెలకొన్నాయి. క్లాసిక్ ఫార్మాట్ లో ఈ నెంబర్లో గతంలో దిగ్గజాలు అయిన సచిన్ టెండూల్కర్, కోహ్లీ బ్యాటింగ్ చేశారు. ఇప్పుడు వీరిని మరిపించేలా ప్రదర్శన చేయాలి, లేకపోతే తప్పకుండా పోలిక వస్తుంది. అలాగే ఈ నెంబర్లో బ్యాటింగ్ చేయాలంటే అటు టెక్నిక్ తోపాటు ఇటు క్లాస్ కూడా ఉండాలి. ఈ నేపథ్యంలో ఈ నెంబర్లో బ్యాటింగ్ చేయగల ఆటగాడిని మాజీ ఓపెనర్ వసీం జాఫర్ సూచించాడు. టెస్టు కెప్టెన్ గా అందరూ భావిస్తున్న శుభమాన్ గిలే ఈ బాధ్యత తీసుకోవాలని సూచించాడు. ఇప్పుడు ఇరవైల్లోనే ఉన్న గిల్.. దీర్ఘకాలంలో ఈ స్థానంలో రాణిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇక ఇప్పటివరకు వివిధ స్థానాల్లో 32 టెస్టులాడిన గిల్.. కేవలం 35 సగటుతో విమర్శల పాలయ్యాడు. ఈ స్థానంలో కుదురుకుంటే, తన కెరీర్ లో పరుగుల వరదకు ఢోకా ఉండదని విశ్వాసం వ్యక్తం చేశాడు. అతనికంటే సీనియర్ అయిన కేఎల్ రాహుల్ ఈ స్థానానికి బదులు మరో స్థానంలో ఆడాలని సూచించాడు. టెస్టుల్లో యశస్వి జైస్వాల్ తో కలిసి ఓపెనింగ్ లోనే కేఎల్ రాహుల్ బ్యాటింగ్ చేయాలని జాఫర్ సూచించాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో ఈ జోడీ అద్భుతంగా రాణించిన విషయాన్ని గుర్తు చేశాడు. మంచి బ్యాటింగ్ పెయిర్ ను విడగొట్టడం దేనికని, అనవసర ప్రయోగాలు చేయడం అవసరం లేదని పేర్కొన్నాడు. ఇక 33 ఏళ్ల రాహుల్ కంటే కూడా కేవలం 26 ఏళ్ల గిల్ నే నెంబర్ 4లో ఆడించడం కరెక్టని అభిప్రాయపడ్డాడు. ఇక గతంలో ఓపెనర్ గా ఆడిన గిల్.. చటేశ్వర్ పుజారా నుంచి నెం.3 స్థానాన్ని తన సొంతం చేసుకున్నాడు. అయితే ఈ స్థానంలో ఎవరు ఆడాలనే దానిపై జాఫర్ జవాబిచ్చాడు. గుజరాత్ టైటాన్స్ తరపున పరుగుల వరద పారిస్తున్న సాయి సుదర్శన్ నెం.3 స్థానానికి అతికినట్లు సరిపోతాడని జాఫర్ విశ్వాసం వ్యక్తం చేశాడు. మంచి టైమింగ్, టెంపర్మెంట్ తన సొంతమని, ఈ ఐపీఎల్లో తను సత్తా చాటాడని గుర్తు చేశాడు. గిల్ స్థానంలో నెం.3లో సుదర్శన్ ను ఆడిస్తే, ఓపెనర్లుగా రాహుల్- జైస్వాల్ జోడీ, సుదర్శన్, గిల్ తో టాప్-4 పటిష్టంగా ఉంటుందని పేర్కొన్నాడు. అయితే టీమ్ మేనేజ్మెంట్ దీనిపై నిర్ణయం తీసుకోవాలి. ఇంగ్లాండ్ లో తొలి టెస్టు సందర్భంగా దీనిపై స్పష్టత వస్తుంది. మరోవైపు నెంబర్ ఫోర్ లో ఆడటానికి చాలామంది బ్యాటర్లు తహతహలాడుతున్నారు. సర్ఫరాజ్ ఖాన్, రజత్ పతిదార్‌తోపాటు శ్రేయస్ అయ్యర్ కూడా ఈ స్థానంపై కన్నేశాడు. వీరిలో తుదిజట్టులో ఎంతమంది ఉంటారో అనే దానిపై సందేహాలు నెలకొన్నాయి. అయితే ప్లేయింగ్ లెవన్ ఎలా ఉండబోతోందో, కొత్త సారథి, హెడ్ కోచ్ గౌతం గంభీర్ ప్రణాళికలు ఏవిధంగా ఉంటాయో చూడటానికి మరో నెలరోజులు ఆగాల్సిందేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు.


## యువ ఆటగాడికి స్థానం కోసమే కోహ్లీ రిటైర్మెంట్!!

దిగ్గజ క్రికెటర్లు విరాట కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడం వెనకాల చాలా పెద్ద కథే నడిచిందని తాజాగా కొన్ని కథనాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా కోహ్లీ సడెన్ రిటైర్మెంట్ నిర్ణయం వెనకాల ఒక ఉద్దేశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే సీనియర్ ఆటగాళ్లు రిటైర్మెంట్ కు దగ్గర పడిన స్థితిలో జట్టు సంధి కాలంలో కెప్టెన్ గా ఉండాలని కోహ్లీ భావించాడని తెలుస్తోంది. అందుకే ఇంగ్లాండ్ పర్యటనకు తనను సారథిగా ఎంపిక చేయాలని బోర్డును కోరాడని సమాచారం. అయితే ఈ నిర్ణయాన్ని బోర్డు సున్నితంగా తిరస్కరించి, యువ ఆటగాడికి ఇవ్వనున్నామని చెప్పడంతో కోహ్లీ ఇలా సడెన్ గా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు గత రెండేళ్లుగా ఫామ్ లేమితో సతమతమవుతున్న కోహ్లీ.. తన వీడ్కోలు సిరీస్ లాగా ఇంగ్లాండ్ సిరీస్ ఆడాలని, అందులో సత్తా చాటి, తనకెంతో ఇష్టమైన రెడ్ బాల్ ఫార్మాట్ కు టాటా చెప్పాలని భావించినట్లు తెలుస్తోంది. బీసీసీఐ నిర్ణయంతో అసంతృప్తికి లోనయిన కోహ్లీ.. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రితో పంచుకున్నాడని సమచారం. అలాగే తన డియరెస్ట్ ఫ్రెండ్ తోపాటు బోర్డులోనే చాలా ఇన్ఫ్లుయెన్స్ ఉన్న రాజీవ్ శుక్లాతో పలు దఫాలుగా ఈ నిర్ణయంపై చర్చలు జరిగాయని తెలుస్తోంది. అయితే ఇవేమీ కోహ్లీ రిటైర్మెంట్ నిర్ణయాన్ని మార్చలేక పోయాయని, దీంతో ఆటకు అల్విదా పలికినట్లు సమాచారం. అలాగే నిర్ణయాన్ని ప్రకటించేముందు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తోనూ రెండుసార్లు మాట్లాడాడని, ఐపీఎల్ కు స్మాల్ బ్రేక్ రావడంతో, ఈ చర్చలు ముమ్మరంగా సాగినట్లు తెలుస్తోంది.గతంలో ఉన్నట్లుగా డ్రెస్సింగ్ రూం.. ప్రస్తుతం లేదని, తనకు ఫ్రీ హ్యాండ్ ఇవ్వడం లేదని కోహ్లీ కంప్లయింట్ చేసినట్లు తెలుస్తోంది. అలాగే మునుపటిలాగా సీనియర్లకు ఉన్న సౌకర్యాలు కరువైనట్లు తెలుస్తోంది. ఈ విషయమై బోర్డు పెద్దలతో మాట్లాడినా పెద్దగా ఫలితం లేదని సమాచారం. నిజానికి ఇంగ్లాండ్ టూర్ తర్వాత రోహిత్, కోహ్లీ రెడ్ బాల్ కు దూరమవ్వాలని భావించారని, అయితే పరిస్థితులు అనుకూలించక అంతకుముందు గానే అల్విదా చెప్పినట్లు తెలుస్తోంది. ఇక రెడ్ బాల్ క్రికెట్లో పది వేల పరుగులను సాధించాలని కోహ్లీ ఎన్నోసార్లు చెప్పాడు. అయితే ఆ కోరిక తీరకుండానే తను టెస్టు ఫార్మాట్ కు వీడ్కోలు పలికాడు. అలాగే కేవలం వన్డేలకే పరిమితమవడంతో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన అంతర్ జాతీయ వంద సెంచరీల రికార్డును కూడా విరాట్ కోహ్లీ చేరే అవకాశం లేదని తెలుస్తోంది.

# టెస్ట్ కెప్టెన్ రేసులోకి మరో పేరు!

## రెండేళ్ల పాటు కెప్టెన్‌గా రవీంద్ర జడేజా?!

రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత టీమిండియా కొత్త టెస్ట్ కెప్టెన్ గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి. భారత జట్టు కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా పేర్లు ముందంజలో ఉన్నాయి. జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకుని, కెప్టెన్సీ బాధ్యతను శుభ్‌మన్ గిల్‌కు అప్పగించవచ్చని భావిస్తున్నారు. అయితే భారత మాజీ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ కెప్టెన్ కోసం ఒక ఆటగాడి పేరును సూచించాడు. అశ్విన్ సూచించిన ఆటగాడి పేరు కూడా ఎప్పుడూ చర్చలోకి రాలేదు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్ అయిన తర్వాత జట్టులో అత్యంత అనుభవజ్ఞుడైన ఆటగాడిని జట్టుకు కెప్టెన్‌గా చేయాలని అశ్విన్ సూచించాడు.రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పోర్ట్స్ జర్నలిస్ట్ విమల్ కుమార్‌తో మాట్లాడుతూ .. టీమిండియా కొత్త టెస్ట్ కెప్టెన్ గురించి మాట్లాడారు. 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌పై ఇప్పుడు అంత ఒత్తిడి తీసుకురావడం సరైనది కాదని అశ్విన్ అన్నాడు. రవీంద్ర జడేజాను రెండేళ్ల పాటు కెప్టెన్‌గా చేయవచ్చని ఆయన అన్నారు. “జట్టులో అత్యంత అనుభవజ్ఞుడైన ఆటగాడు రవీంద్ర జడేజా. మీరు కొత్త ఆటగాడికి శిక్షణ ఇవ్వాలనుకుంటే జడేజాను రెండేళ్లపాటు కెప్టెన్‌గా చేయండి. జడేజా రెండేళ్ల పాటు జట్టుకు నాయకత్వం వహించవచ్చు. శుభ్‌మన్ గిల్‌ను రవీంద్ర జడేజాకు డిప్యూటీ అంటే వైస్ కెప్టెన్‌గా చేయవచ్చు” అని అశ్విన్ అన్నాడు.భారత జట్టుకు కెప్టెన్ కావడం ప్రతి ఆటగాడి కల అని అశ్విన్ అన్నాడు. ఈ క్రమంలో రవీంద్ర జడేజా కూడా ఈ పాత్రను సంతోషంగా అంగీకరిస్తాడని చెప్పుకొచ్చాడు. జడేజాను కెప్టెన్ గా చేయమని తాను బలవంతం చేయడం లేదని.. కానీ జడేజాకు కెప్టెన్సీని అప్పగించడంలో ఎటువంటి హాని లేదని అశ్విన్ పేర్కొన్నాడు.రవీంద్ర జడేజా గతంలో ఐపీఎల్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే రవీంద్ర జడేజా కెప్టెన్సీలో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన చాలా నిరాశపరిచింది. రవీంద్ర జడేజా సీజన్ మధ్యలో కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. రవీంద్ర జడేజాకు అనుభవానికి లోటు లేదు. రవీంద్ర




జడేజా 2012లో టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. అంటే జడేజా భారత్ తరఫున టెస్టుల్లో 13 సంవత్సరాల నుంచి ఆడుతున్నాడు. జడేజా తన బ్యాటింగ్, బౌలింగ్‌తో టీమిండియా అనేక మ్యాచ్‌లను గెలిపించడంలో సహాయపడ్డాడు.

## 2025 ఐపీఎల్ 17న రీస్టార్ట్

### హంగు, ఆర్భాటాలు లేకుండా నిర్వహణ!!




2025 ఐపీఎల్ మే 17న రీస్టార్ట్ కానుంది. ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న జట్లన్నీ టోర్నీకి రెడీ అవుతున్నాయి. ఆటగాళ్లు ఇప్పటికే తమతమ ఫ్రాంచైజీ క్యాంపుల్లో చేరి ప్రాక్టీస్ మొదలు పెట్టేశారు. మే 17న ఆర్సీబీ-కేకేఆర్ మ్యాచ్‌తో టోర్నీ పునః ప్రారంభం కానుంది. అయితే మిగిలిన మ్యాచ్?లను ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుత ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ సహా 17 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. అయితే ఈ మ్యాచ్‌లను సింపుల్‌గానే నిర్వహించాలని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ బీసీసీకి సూచించాడు. గ్రౌండ్‌లో చీర్ లీడర్స్, డీజే హడావుడి లేకుండా టోర్నీ జరపాలని బోర్డుకు చెప్పాడట. గతనెల కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో కుటుంబాల గౌరవార్థం ఈ నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే గావస్కర్ ప్రస్తావించిన అంశాన్ని బీసీసీఐ కూడా పరిగణలోకి తీసుకున్నట్లు సమాచారం. అందుకు సమ్మతిస్తూ హంగు, ఆర్భాటాలు లేకుండా మిగతా మ్యాచ్‌లు నిర్వహించేందుకు బీసీసీఐ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.కాగా, పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో మే 08న టోర్నీ తాత్కాలిక వాయిదా పడింది. ధర్మశాల వేదికగా జరిగిన దిల్లీ- పంజాబ్ మ్యాచ్?ను మధ్యలోనే రద్దు చేశారు. దేశంలో నెలకొన్ని టెన్షన్ వాతావరణం దృష్ట్యా టోర్నీకి బ్రేక్ ఇచ్చారు. తాజాగా భారత్- పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం వల్ల టోర్నమెంట్?ను మళ్లీ ప్రారంభిస్తున్నారు. అయితే భద్రతా కారణాల వల్ల మిగిలిన టోర్నీని ఆరు వేదికల్లో నిర్వహిస్తున్నారు. మే 17న పునః ప్రారంభం కానున్న టోర్నీ జూన్ 03న ముగుస్తుంది. అయితే ఈసారి ఐపీఎల్?లో ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా సాగేలా కనిపిస్తోంది. టోర్నీలో ఇప్పటికే 57 మ్యాచ్‌లు పూర్తైనా అధికారికంగా ఏ జట్టు కూడా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేదు. మూడు (సన్‌రైజర్స్, రాజస్థాన్, చెన్నై) జట్లకు మినహా ఏడు టీమ్స్?కు ప్లేఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉన్నాయి. దీంతో మిగిలిన టోర్నీ ఫుల్ మజా అందించడం పక్కా.

## 10వ తరగతి పరీక్షల్లో ఫెయిలైన వైభవ్ సూర్యవంశీ?




యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి వార్తల్లోకెక్కాడు. ఇటీవల వైభవ్ ఐపీఎల్?లో అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డ్ కొట్టాడు. ఆ తర్వాత కెరీర్?లో ఆడిన మూడో మ్యాచ్?లోనే విధ్వంసం సృష్టించాడు. కేవలం 35 బంతుల్లోనే సెంచరీ బాది యావత్ క్రికెట్ ప్రపంచం దృష్టిని తన వైపునకు తిప్పుకున్నాడు. ఇవన్నీ అటుంచితే తాజాగా మరోసారి వైభవ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాడు. అతడు 10వ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్?ఈ) ఇటీవల 10వ తరగతి పరీక్ష ఫలితాలు వెల్లడించింది. ఈ ఫలితాల్లో ఐపీఎల్ సంచలనం వైభవ్ ఫెయిల్ అయ్యాడంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. అతడి పరీక్షా పేపర్లను బీసీసీఐ డీఆర్ఎస్ పద్ధతిలో రివ్యూ చేయాలంటూ ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. అయితే అది 'సెటైరికల్ పోస్ట్'. వైభవ్ 10వ తరగతి ఫెయిల్ అయ్యాడంటూ వస్తున్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదు.'ఫెయిల్ అయ్యాడనే దాంట్లో నిజం లేదు. మరి పాసయ్యాడా?' అంటూ ఫ్యాన్స్ గూగుల్?లో తెగ వెతికేస్తున్నారు. అయితే వైభవ్ పాస్ కూడా కాలేదు. అదేంటి అనుకుంటున్నారా? అసలు పరీక్ష రాస్తేనే కదా, ఫెయిల్ లేదా పాస్ అయ్యేది. వాస్తవానికి వైభవ్ ఈ ఏడాది ఎలాంటి %జదీూజు 1౧ష్ట్ర% పరీక్షలు రాయలేదు. సోషల్ మీడియా పోస్టులన్నీ ఉత్తుత్తి ప్రచారమే!అయితే వైభవ్ ఐపీఎల్? కారణంగానే పది పరీక్షలు రాయలేదని కథనాలు వస్తున్నాయి. అవి కూడా రూమర్సే. ఎందుకంటే వైభవ్ ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన మనోడు 10వ పరీక్షలకు ఇంకో ఏడాది సమయం ఉందన్న మాట!ఇక వైభవ్ క్రికెట్ కెరీర్ విషయానికొస్తే, గతనెల లఖ్?నవూ మ్యాచ్?తో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఈ సీజన్?లో 5 మ్యాచ్?ల్లో వైభవ్ 155 పరుగులు చేశాడు. ఇందులో గుజరాత్?పై 35 బంతుల్లో సెంచరీ బాది, ఐపీఎల్?లో అత్యంత వేగంగా శతరం నమోదు చేసిన భారత బ్యాటర్?గా నిలిచాడు. ఇక గతేడాది జరిగిన మెగా వేలంలో రాజస్థాన్ ఫ్రాంచైజీ అతడిని రూ. 1.10 కోట్లకు దక్కించుకుంది.

## వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు భారీ ప్రైజ్‌మనీ




2025 వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఆస్ట్రేలియా- సౌతాఫ్రికా సిద్ధం అవుతున్నాయి. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానం వేదికగా జూన్ 11 నుంచి 14 దాకా ఈ ఫైనల్ జరగనుంది. ఇరుజట్లు ఇప్పటికే తమతమ జట్లను ప్రకటించేశాయి. ఈ క్రమంలో ఐసీసీ ఛైర్మన్ జై షా డబ్ల్యూటీసీ 2025 ప్రైజ్‌మనీని గురువారం ప్రకటించారు. గతంలో కంటే ఈసారి ఐసీసీ భారీగా ప్రైజ్?మనీ అందించనుంది. మొత్తం ఫైనల్‌లో ఇరుజట్లకు $5.7 మిలియన్ డాలర్లు (సుమారు రూ.48 కోట్లు) ఇవ్వనుంది. వరల్డ్‌టెస్టు ఛాంపియన్‌గా నిలిచిన జట్టు భారీ మొత్తంలో ప్రైజ్‌మనీ అందుకోనుంది. ఫైనల్?లో విజయం సాధించిన జట్టుకు $ 3.6 మిలియన్ డాలర్లు (సుమారు రూ.31 కోట్లు) భారీ నజరానా అందనుంది. గత రెండు సీజన్ (2021, 2023)కంటే ఇది దాదాపు రెండింతలు. గతంలో 2021, 2023 డబ్ల్యూటీసీ టోర్నీల్లో ఛాంపియన్ జట్లకు రూ.14 కోట్లు ఇచ్చారు.రన్నరప్ ప్రైజ్‌మనీ కూడా భారీగానే పెంచారు. ఈసారి ఫైనల్‌లో ఓడిన జట్టు రన్నరప్‌గా $2.16 మిలియన్ డాలర్లు (సుమారు రూ.18 కోట్లు) అందుకోనుంది. గతంలో కంటే ఇది 162 శాతం ఎక్కువ. 2021, 2023 డబ్ల్యూటీసీ టోర్నీల్లో రన్నపర్ జట్లకు రూ.8 కోట్లే అందించారు. అయితే ఛైర్మన్ జై షా ఎక్స్‌లో ప్రైజ్‌మనీ అనౌన్స్ చేశారు. భారీగా నజరాన పెంచేందుకు గల కారణాన్ని ఇందులో క్లారిటీగా రాసుకొచ్చారు. 'WTC 25 ఫైనల్ ప్రైజ్‌మనీ హ్యాపీగా అనౌన్స్ చేస్తున్నా. ఆస్ట్రేలియా- సౌతాఫ్రికా మధ్య ఫైనల్‌లో ఛాంపియన్ జట్టుకు $3.6 మిలియన్ డాలర్లు దక్కుతాయి. అలాగే రన్నరప్‌కు $2.1 మిలియన్ అందుతాయి. అయితే టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇస్తూ, WTC సైకిల్ (టోర్నీ) ప్రోత్సహించడానికి ప్రైజ్‌మనీ పెంచాము' అని జై షా రాసుకొచ్చారు.

**జట్లు ఇవే**

ఆస్ట్రేలియా : ఉస్మాన్ ఖవాజా, సామ్ కాన్‌స్టాస్, మార్నస్ లాబుషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, అలెక్స్ కేరీ, జోష్ ఇంగ్లిస్, కామెరాన్ గ్రీన్, వెబ్‌స్టర్, పాట్ కమ్మిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, స్కాట్ బోలాండ్, నాథన్ లియాన్, మాట్ కుహ్నెమాన్. ట్రావెలింగ్ రిజర్వ్ : బ్రెండన్ డాగెట్

సౌతాఫ్రికా : టోనీ డి జోర్జి, ర్యాన్ రికెల్టన్, ఎయిడెన్ మార్‌క్రమ్, టెంబా బావుమా (కెప్టెన్), డేవిడ్ బెడింగ్‌హామ్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెర్రెయిన్, వియాన్ ముల్డార్, మార్కో జాన్సెన్, కార్బిన్ బాష్, కగిసో రబాడా, లుంగి ఎంగ్డి, డేన్ ప్యాటర్సన్, కేశవ్ మహరాజ్, సెనురన్ ముత్తుసం



# దిశా సెల్ఫీ దెబ్బకు మైండ్ బ్లాక్

సెల్ఫీ క్వీన్ దిశా పటానీ మరోసారి సెల్ఫీతో చెలరేగింది. ఆదమరిచి సెల్ఫీ తీసుకుంటున్న దిశా పటానీని సీసీ కెమెరా ఎలా క్లిక్ చేసిందో చూసారు కదా! అలా గదిలో బికినీ అందాలను తనివి తీరా చూసుకుంటూ పనిలో పనిగా సెల్ఫీ కోసం ట్రై చేస్తూ ఇలా దొరికిపోయింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో దుమారం రేపుతోంది.


దిశా పటానీ ఇటీవల తన చేతిపై %ూణ% అనే పచ్చబొట్టుతో కనిపించి రకరకాల సందేహాలకు తెర తీసింది. పి - అంటే ప్రభాస్. డి అంటే దిశా.. ఆ ఇద్దరి మధ్యా ఏదో నడుస్తోంది అంటూ ఒకటే ప్రచారం సాగింది. కల్కి 2898 ఏడి లో నటించాక ఆ ఇద్దరి మధ్యా స్నేహం పెరిగిందన్న గుసగుస వినిపించింది. అయితే పిడి అంటూ టీజ్ చేసిన దిశా పాపులర్ కమర్షియల్ బ్రాండ్ కి ప్రచారం చేసుకుంది.

ఇదిలా ఉంటే ఇటీవల కొందరు కుర్రాళ్లు తమ గదుల్లో దిశా పోస్టర్‌ను ఉంచి, ఆన్‌లైన్‌లో తమ ప్రేమను ప్రకటించిన చిలిపి పని సంచలనం సృష్టించింది. ముఖ్యంగా కాలేజీ అబ్బాయిల బృందం దాని కంటే వింతైన పనితో చర్చగా మారారు. వ్యాలెంటైన్స్ డే పేరుతో యూత్ బోలెడంత రచ్చ చేసారు. బోయ్స్ అంతా ఏదో ఒక రోజు తమ కన్యత్వాన్ని కోల్పోవడానికి ఒక పూజలు పునస్కారాలు చేయడం షాక్ కి గురి చేసింది. దిశా అందచందాల ప్రదర్శన, నటనకు వీరంతా వీరాభిమానులు. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.



# దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో ఎన్టీఆర్?

తాజా సమాచారం ప్రకారం సినీ పితామహుడిగా పరిశ్రమ కొనియాడే దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ లో నటించేందుకు తారక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం నడుస్తుంది. ఈ ప్రాజెక్టు వెనుక రాజమౌళి, కార్తికేయ, వరుణ్ గుప్తా ప్రమేయం కూడా ఉందని టాక్. అంతే కాదు.. ఇప్పటికే స్క్రిప్ట్ కూడా సిద్ధం కాగా, అది విన్న జూనియర్ ఎన్టీఆర్ చాలా ఎగ్జైట్ అయి ఓకే చేశారట. అయితే భారతీయ చలన చిత్ర పరిశ్రమ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రెండేళ్ల కిందటనే 'మేడ్ ఇన్ ఇండియా' అనే సినిమా అనౌన్స్ చేయగా, దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి సమర్పణలో నితిన్ కక్కర్ మూవీని తెరకెక్కించబోతున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, త్వరలో వెల్లడిస్తామని అప్పుడు చెప్పగా, ఆ తర్వాత దాని నోరు విప్పింది లేదు. కాని ఇప్పుడు ఉన్నట్టుండి ఇందులో ఎన్టీఆర్ నటిస్తారని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. దాదాసాహెబ్ ఫాల్కే జీవితం చాలా పెద్దది. అలాంటి కథలను కచ్చితంగా ఇప్పటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. అందుకే జూనియర్ ఎన్టీఆర్ లాంటి నటు-డు అయితేనే ఈ ప్రాజెక్ట్ భాగా చేయగలరు. మరి ఇండియన్ సినిమా పుట్టుక, పెరుగుదలను తెలియజేస్తూ.. సినిమాలకి బీజం ఎక్కడ పడింది, ఎదిగే క్రమంలో ఎలాంటి ఒడిదుడుకులు ఎదుర్కోవలసి వచ్చింది అనేది చిత్రంలో చూపించనున్నారట.




# అందాల ప్రగ్య

కంచె బ్యూటీ ప్రగ్య జైశ్వాల్ ఇటీవల ముంబై పరిశ్రమలో అవకాశాల వేట సాగిస్తున్న సంగతి తెలిసిందే. సల్మాన్ ఖాన్ లాంటి పెద్ద హీరో ఈ భామకు అవకాశం కల్పించినా అదృష్టం కలిసి రాలేదు. ప్రస్తుతం తన స్నేహితురాళ్లు మంచు లక్ష్మి, రకుల్ తో కలిసి తన కెరీర్ గేమ్ ఛేంజర్ ఛాన్స్ కోసం వేచి చూస్తోంది. ఇదే సమయంలో వరుస ఫోటోషూట్లతో విరుచుకుపడుతూ అభిమానులను యంగేజ్ చేస్తోంది.

తాజాగా మరోసారి ప్రగ్య ఓ స్పెషల్ ఫోటోషూట్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. మేకప్ రూమ్ లో మేకప్ సెషన్స్ లో ఉన్న ప్రగ్య అలా అద్దంలో తన రూపాన్ని చూసుకుని మురిసిపోతోంది. పక్కనే మేకప్ ఆర్టిస్ట్ ఎనర్జిటిగ్గా ఫోటోకు ఫోజులిచ్చాడు. ఈ ఫోటోలో ప్రగ్య పసుపు రంగు ఫ్రాకులో ఎంతో బ్యూటిఫుల్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. అద్దంలో చిక్కిన అందాల భామ అంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

ప్రగ్య ప్రస్తుతం హిందీ చిత్రసీమలో ఔత్సాహిక దర్శకులు వినిపించిన కథలు వింటోందని సమాచారం. కానీ ఇంకా అధికారికంగా ఏదీ ఫైనల్ చేయలేదు. త్వరలోనే తదుపరి సినిమాకి సంబంధించిన అప్ డేట్ చెబుతుందని అభిమానులు భావిస్తున్నారు.



# పాపం... ఈమె పరిస్థితి ఏమి బాగాలేదట

పెద్దగా సినిమాల్లో నటించకున్నా, బిగ్ బాస్‌కి వెళ్లినా అక్కడ ఎక్కువ రోజులు లేకున్నా ఉర్ఫీ జావేద్ సోషల్ మీడియా ద్వారా పాపులారిటీని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఎంతో మంది హీరోయిన్స్‌తో పోల్చితే సోషల్ మీడియాలో ఉర్ఫీకి ఉన్న ఫాలోయింగ్ ఎక్కువ అని చెప్పాలి. సోషల్ మీడియాలో ఈమెకు ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈమె రకరకాలుగా ఔట్ ఫిట్‌లో కనిపించడం ద్వారా అన్ని భాషల ప్రేక్షకుల్లోనూ ఈమెకు గుర్తింపు లభించింది. సినిమాల్లో ఆఫర్ల కోసం చాలా ప్రయత్నించినప్పటికీ పెద్దగా ఆఫర్లు రావడం లేదు. అయినా ఇండస్ట్రీలో కొనసాగేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. సోషల్ మీడియాలో ఈమె జోరు కొనసాగుతోంది. ఉర్ఫీ జావేద్ ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా కనిపించడం లేదు. గతంతో పోల్చితే ఉర్ఫీ ఎక్కువగా ఔట్ ఫిట్‌లను ట్రై చేయడం లేదు. పైగా ఈమె సోషల్ మీడియాలో రెగ్యులర్ పోస్ట్‌లను సైతం షేర్ చేయడం లేదు. దాంతో చాలా మంది ఉర్ఫీ జావేద్ కనిపించడం లేదు అంటూ కామెంట్ చేస్తున్నారు. ఉన్నట్టుండి ఉర్ఫీకి ఏమైంది అంటూ కొందరు కామెంట్ చేస్తే, మరికొందరు ఉర్ఫీకి ఇండస్ట్రీపై ఆసక్తి తగ్గిందేమో, ముందు ముందు కూడా ఆమె సోషల్ మీడియాకు మరింతగా దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సినిమా ఇండస్ట్రీలో ఇలా వచ్చి పోయే వారు చాలా మంది ఉంటారు, అందులో ఉర్ఫీ ఒకరు అని పలువురు కామెంట్ చేస్తున్నారు.



# రాజ్‌తో సమంత..సతీమణి శ్యామాలి పోస్ట్ వైరల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత వ్యాక్తిగత జీవితం గురించి రోజుకో వార్త వైరల్ అవుతూనే ఉంటోంది. ఎంతో ప్రేమించిన అక్కినేని నాగచైతన్యతో విడాకుల తర్వాత సింగిల్‌గా ఉంటుంది సమంత. నాగచైతన్య రెండో పెళ్లి చేసుకోని హ్యాపి లైఫ్ లీడ్ చేస్తున్నప్పటికి సమంత కూడా రెండో పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అభిమానులు, సినీ ప్రియులు కోరుకుంటు-న్నారు. అయితే కొద్ది రోజులుగా దర్శకుడు రాజ్ నిడిమోదుతో తరచు కనిపిస్తోంది సామ్.. ఎక్కడికి వెళ్లిన సమంత పక్కన రాజ్ ఉంటున్నాడు. దీంతో ఆమె వైవాహిక జీవితం పై నెట్టింట రూమర్స్ గట్టిగానే ప్రచారం అవుతున్నాయి. అయితే రాజ్ నిడిమోరుకు ఇప్పటికే పెళ్లి అయ్యింది. ఇలాంటి టైం లో తాజాగా సమంత తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. ఇందులో రాజ్‌పై సమంత వాలినట్టుగా కనిపిస్తుంది. దీంతో ఈ వార్తలు మరింత పుంజుకున్నాయి. వారి బాండింగ్ రోజు రోజుకి బలపడుతుందిగా అని కొందరు కామెంట్ చేస్తున్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. అయితే తాజాగా రాజ్ సతీమణి శ్యామాలి తాజాగా ఎక్స్ వేదికగా ఒక సందేశాత్మక పోస్ట్ పెట్టింది.. 'నా గురించి ఆలోచించి, విని, మాట్లాడేవారితోపాటు నన్ను కలిసి, నాతో మాట్లాడి నా గురించి రాసే వారందరికి ప్రేమ, ఆశీస్సులు పంపుతున్నా' అనే పోస్ట్ ను ఆమె షేర్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ గా మారింది. కొంతకాలంగా ఎలాంటి పోస్ట్ షేర్ చేయని ఆమె ఉన్నట్టుండి ఇలాంటి సందేశం ఎందుకు షేర్ చేశారా? అని, ఆమె కచ్చితంగా సమంతని ఉద్దేశించే మాట్లాడుతూంది అని కామెంట్ లు విపడుతున్నాయి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463